
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 7 నవంబరు 2025



ఆకాశ దీపాన్ని వేలాడదీస్తున్న ప్రవచనకర్త చాగంటి, పక్కన రామానంద భారతి, వేమిరెడ్డి దంపతులు

దేదీప్యం.. కార్తీక దీపోత్సవం

నెల్లూరులోని వీఆర్సీ మైదానం గురువారం సాయంత్రం కార్తీక దీపకాంతులతో వెలిగిపోయింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతుల నేతృత్వంలో కార్తీక దీపోత్సవం వైభవంగా ప్రారంభమైంది. నాగేశ్వర జ్యోతిర్లింగ ఆలయం, పండరినాథ స్వామి ఆలయ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉదయం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం విశాఖ శ్రీసౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీస్వామి, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు విశిష్ట అతిథులుగా హాజరై ఆకాశ దీపాన్ని వెలిగించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక మాస విశిష్టతపై కోటేశ్వరరావు ప్రవచించారు.

- వివరాలు 6లో..



దగదర్తిలో టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేష్



సుబ్బానాయుడు సతీమణి భవానిని ఓదార్చుతున్న మంత్రి లోకేష్ తదితరులు

మాలేపాటి కుటుంబాన్ని
ఆదుకునే బాధ్యత నాది!

- ఓ మంచి నాయకుడిని పార్టీ కోల్పోయింది
- ఆయనతో నాకు అవినాభావ సంబంధం
- వేధించిన వారిపై కఠిన చర్యలు తప్పవు
- మంత్రి నారా లోకేష్
- దగదర్తికి తరలివచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు

వివరాలు 6లో..



ఆటోను ఢీకొట్టిన కారు

- 15 మంది గాయపడగా.. వీరిలో పదిమంది మహిళలే
- మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికి వస్తుండగా ప్రమాదం

కందుకూరును 'ప్రకాశం'లో కలపాలి
ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయండి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో
కొనసాగుతున్న ఏసీబీ దాడులు

ప్రతి ఫైల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నేడు కూడా సోదాలు కొనసాగే అవకాశం

నెల్లూరు (క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు గురువారం కూడా కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి, ఆరోపణల ఫిర్యాదులు అందిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఈ నెల 5వ తేదీన ఏసీబీ



అధికారులు దాడులు చేపట్టారు. ఈ క్రమంలోనే స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రామకృష్ణుడు ఆధ్వర్యంలో అధికారులు సోదాలు నిర్వహించారు. నిత్యం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్లు, ఇతర మధ్యవర్తులతో రద్దీగా ఉండే ఈ కార్యాలయంలో ఒక్కరు కూడా కనిపించలేదు. కార్యాలయంలోని ప్రతి ఫైల్‌ను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే, శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

'సోమశిల'లో 71 టీఎంసీల నీరు

అనంతసాగరం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 71.164 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 14,478 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● **రాపూరు** : కండలేరు డ్యాం నీటిమట్టం 58.64 టీఎంసీలకు చేరుకున్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు.

సన్నద్ధం

- రబీ సాగుకు అన్నదాతల రెడీ
- 5.05 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- అంచనాలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

జిల్లాలో ప్రధానమైన రబీ సీజన్‌కు రైతులు సమాయత్తం అవుతున్నారు. నీరు పుష్కలంగా ఉండడంతో ఈ సీజన్‌లో వరి సాగుకే అధికశాతం మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో దాదాపుగా 5.05 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో 4.30 లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు.

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలో 5.05 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, నీరు పుష్కలంగా ఉండటంతో మరో 50వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నా యి. 4.3లక్షల ఎకరాల్లో వరి, మరో లక్ష ఎకరాల్లో పెసర, శనగలు, మినుములు, వేరుశగన పంటలు సాగవుతాయని అంచనా.

● **రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు**

జిల్లావ్యాప్తంగా రైతులు కేఎన్ఎం733, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 16048 వరి రకాలకే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతోపాటు ఎన్ఎల్ఆర్ 34449, ఎంటీయు 1010 రకాలు కూడా సాగుచేసే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా దాదాపు లక్ష క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే ఏపీ సీడ్స్ వద్ద కేఎన్ఎం 1638 రకం 3355.4 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 15048 రకం 638 క్వింటాళ్లు, బిపిటి 5204 రకం 80.25 క్వింటాళ్లు అదేవిధంగా ఏఆర్ఎస్‌లో బిపిటి 5204 రకం 120 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్ 34449 రకం 120 క్వింటాళ్లు ఇంకా డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద మొత్తం 69,513.99 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచామని, కేజీ రూ.5 సబ్సిడీపై రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు.



రైతులకు కార్డులతోపాటు యూరియా పంపిణీ చేస్తున్న కోవూరు ఏడీఏ అనిత(ఫైల్)


● **94500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం**

ఈ సీజన్‌లో దాదాపుగా 94,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 11వేల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా 10వేల మెట్రిక్ టన్నులు జిల్లాలో అందుబాటులో ఉందని అంటున్నారు. మరో 18వేల టన్నుల యూరియా దిగుమతి అవుతోందని ప్రస్తుత పరిస్థితులకు యూరియా కొరత ఉండదని అవసరాన్ని బట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దిగుమతి చేసుకుంటున్నారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులతో కలిపి దాదాపుగా 38వేల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

మొలక శాతం తప్పనిసరిగా పరిశీలించుకోవాలి

రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత మొలకశాతాన్ని తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. అదేవిధంగా విత్తనాల కొనుగోలు రశీదు, బ్యాగును పంట పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి. మొలకశాతం తగ్గితే వెంటనే నాణ్యమైన విత్తనాలు తిరిగి తీసుకునేందుకు రశీదు ఉపయోగపడుతుంది. ఈ సీజన్‌లో ఎకరాకు మూడు బస్తాల యూరియాను ఒకటి నుంచి మూడు విడతలుగా అవసరాన్ని బట్టి ఇవ్వనున్నాం. దీనికి సంబంధించి రైతులకు ప్రత్యేకంగా కార్డులు కూడా పంపిణీ జరుగుతోంది. పచ్చిశనగ, సజ్జలు అవసరమైన రైతులు ముందుగా నగదు చెల్లిస్తే 40శాతం సబ్సిడీపై ఆర్ఎస్‌కేల ద్వారా అందిస్తాము.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి



సందిగ్ధం

సాగులో కీలకమైన రబీ సీజన్ ప్రారంభమైంది. ఈదఫా సోమశిల, కండలేరు జలాశయాలతోపాటు చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో పూర్తిస్థాయి విస్తీర్ణంలో సాగుకు రైతాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే నార్లు పోసుకోవడం మొదలుపెట్టారు. అయితే ముఖ్యమైన కాలువల నిర్వహణ విషయంలో యంత్రాంగం ఉదాసీనత వ్యవహారిస్తోంగా ప్రధాన కాలువల నుంచి ఉపకాలువల వరకూ గుర్రపు డెక్క, పూడికతీతో నిండిపోయి ఉన్నాయి. ఇటీవల తుఫాన్ కారణంగా వరదలతో చాలా కాలువలు రూపుకోల్పోయాయి. వీటిలో పూడిక తీయకపోతే చివరి ఆయకట్టు వరకూ సాఫీగా నీరందించడం కష్టమవుతుంది. శనివారం సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు వరకూ సాగుకు నీరిచ్చే అంశాన్ని ఈ సమావేశంలో తీర్మానిస్తారు. ఆ వెంటనే నీటి విడుదల కూడా మొదలుపెడతారు. కానీ ఇంతవరకూ కాలువల ఆపరేషన్-మెయింటెనెన్స్ పనులు మొదలుకాకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.



నెల్లూరు : గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయిన జాఫర్‌సాహెబ్ కాలువ

- రబీ మొదలైంది.. పూడికతీతే మిగిలింది!
- నార్లు పోసుకుంటున్న రైతాంగం
- పూడిక, గుర్రపు డెక్కతో నిండిన కాలువలు
- తుఫాన్ కారణంగా మరింత డ్యామేజీ
- ఇప్పటికీ ఓఅండ్ఎం పనులకు రాని అనుమతులు
- రేపు ఐఏబీ నిర్వహణకు సన్నాహాలు

నెల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సీజన్‌కు ముందు సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా కాలువలను బాగు చేసుకోవాల్సి ఉంటుంది. అందులోనూ ఈ ఏడాది రెండో పంట కూడా మూడు లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. ఈ ఆయకట్టు పరిధిలోని కాలువలన్నీ ఇప్పుడు పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయి ఉన్నాయి. ఇటీవల వరదలతో మరింత మట్టి ఈ కాలువల్లో చేరిపోయింది. ఈ నేపథ్యంలో కాలువలను అత్యవసరంగా బాగు చేయాల్సి ఉంది. కాలువల్లోకి నీటి విడుదల మొదలుపెట్టాక ఓఅండ్ఎం పనులు చేయడం సాధ్యపడదు. గతంలో ఇదే మాదిరిగా సీజన్ మొదలయ్యాక అనుమతులు ఇవ్వడంతో పనులు చేసినట్లు చూపించి రూ.కోట్లు స్వాహా చేశారు. ఈ ఏడాది రెండో సీజన్‌లో కూడా సాగు సగం జరిగాక ఓఅండ్ఎం పనులకు అనుమతులు వచ్చాయి. అప్పుడు కూడా పనులు చేయించేందుకు అధికారులు నానా అవస్థలు పడ్డారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ సీజన్‌లోనైనా వేగంగా ఓఅండ్ఎం పనులు పూర్తి చేయకపోతే చివరి ఆయకట్టు రైతాంగానికి ఇబ్బందులు తప్పవు.



అనంతసాగరం- లింగంగుంట వద్ద జమ్ముతో నిండిన కాలువ

త్వరగా మొదలుపెడితేనే..

రబీ సీజన్‌కు సంబంధించి నీటి కేటాయింపుల కోసం ఐఏబీ సమావేశాన్ని శనివారం నిర్వహించాలని నిర్ణయించారు. సోమశిల కింద పూర్తిస్థాయి ఆయకట్టు 5.50 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అలానే కండలేరు కింద కూడా పూర్తి ఆయకట్టులో ఈ దఫా సాగు జరగనుంది. అయితే ఓఅండ్ఎం పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఇంకా ప్రతిపాదనలు తయారు చేస్తూనే ఉన్నారు. ఫ్లడ్ డ్యామేజీ రిపేర్స్ (ఎఫ్‌డీఆర్) కింద ఓఅండ్ఎం పనులకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌కు భారీ ప్రతిపాదనలు పంపగా, ఆయన వాటిని తిప్పి పంపినట్లు తెలిసింది. అత్యవసరమైన పనులు మాత్రమే ప్రతిపాదించాలని సూచించినట్లు సమాచారం. అయితే ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి కాలువలను బాగు చేయాలని రైతాంగం కోరుతోంది.

జిల్లాకు వంద
ఎలక్ట్రికల్ బస్సులు



- నెల్లూరు-2 డిపోకి కేటాయింపు
- వచ్చే ఏడాది మార్చి కల్లా రాక
- డిపో గ్యారేజ్‌లో 25 చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు
- ఇతర డిపోల్లోనూ చార్జింగ్ పాయింట్లు

వివరాలు 5లో..

ఇన్‌చార్జి డీఎస్వోగా లీలారాణి

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల శాఖ అధికారిగా లీలారాణిని నియమిస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న విజయకుమార్ జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులు కావటంతో మెప్మా పీడీగా పని చేస్తున్న లీలారాణిని ఇన్‌చార్జి డీఎస్వోగా నియమించారు.

మొగళ్ళపాళెం ఇండోర్ స్టేడియం త్వరలో ప్రారంభం

- వివరాలు 6లో..

జిల్లాలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు



- ఇప్పటికే పదిచోట్ల ప్రైవేట్ స్టేషన్ల ఏర్పాటు
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మరో పదింటికి సన్నాహాలు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి. ఆ మేరకు ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే పది ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలోనూ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు అవసరమైన స్థలాల సేకరణకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

● **జిల్లావ్యాప్తంగా పది చోట్ల..**

విద్యుత్ వాహనాలకు చార్జింగ్ సమస్య ఏర్పడకుండా ఉండేందుకు తొలిగా ప్రైవేటు వ్యక్తులు ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు సిటీలో నాలుగు, కావలిలో 4, ఆత్మకూరులో ఒకటి, కోవూరులో ఒకటి చొప్పున మొత్తం పది చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రత్యేకంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. బస్సు, పెద్ద వాహనాలకు పూర్తి చార్జింగ్‌కు రూ.1,600, కార్లకు పూర్తి చార్జింగ్‌కు రూ.692 చొప్పున చార్జీలను వసూలు చేస్తున్నారు.



కావలిలో ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రాఘవేంద్రం

● **ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో..**

ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖాధికారులు రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు పది చోట్ల స్థలాలను అధికార యంత్రాంగం గుర్తిం చినందున వీటిని మరింతగా పెంచి జాతీయ రహదారులు, ఇతర రహదారులు, నగరంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. స్థలాల సేకరణ పూర్తి కాగానే స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు.

● **త్వరలో విధివిధానాలు**

ఇప్పటికే విద్యుత్ వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ప్రకటించగా ఈవీ చార్జింగ్ స్టేషన్లకు రాయితీలను ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణలో ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ప్రత్యేక రాయితీలను అక్కడ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రైవేటు వ్యక్తులు భారీగా ముందుకొచ్చి చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అలాగే ఏపీ ప్రభుత్వం కూడా త్వరలో రాయితీలపై విధివిధానాలను ప్రకటించే అవకాశం ఉందని విద్యుత్ శాఖాధికారులు తెలుపుతున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా భారీగా ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

మనుబోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లలోని విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. బాలికల హాస్టల్‌కు 70, బాలుర హాస్టల్‌కు 60 దుప్పట్లను ప్రభుత్వం సరఫరా చేయగా, తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి చేతుల మీదుగా హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మ్యాట్రిన్లు మహేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11566
వెండి కిలో ధర	రూ. 152100
వెండి ఒక గ్రాము	రూ. 158.10

వావింటపర్తిలో యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

పొదలకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావింటపర్తి, పులికల్లు గ్రామ పంచాయతీ పరిధిలో 400 బస్తాల యూరియాను వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు గురువారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, టీడీపీ నాయకులు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, నెట్టెం పెంచలనాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎరువుల కొరత గురించి రైతులు ఇబ్బందిపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులకు కార్డు అందలేదనే కారణంతో ఎవరూ నిరాశపడాల్సిన అవసరం లేదని.. రైతు సేవా కేంద్రాల్లో లేదా సొసైటీ కార్యాలయంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకుని కూడా యూరియా పొందవచ్చని సూచిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దశయ్య, వెంకటరత్నంనాయుడు, రమణయ్య, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

అపరిశుభ్రతే వ్యాధులకు మూలం



మొక్కలు నాటుతున్న వైద్యులు

విడవలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయని విడవలూరు పీహెచ్‌సీ వైద్యులు హరికృష్ణ, సూపర్‌వైజర్ సురేష్‌లు తెలిపారు. విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దీనదయాల్ అధ్యక్షతన మన్మథరావు పేటలో ఎన్ఎస్ఎస్ క్యాంపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు రోడ్లని, వీధులను శుభ్రపరిచారు. అనంతరం మొక్కలను నాటారు. పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పరిసరాల పరిశుభ్రతపై క్యాంపు నిర్వహించటం అభినందనీయమన్నారు. దీనివల్ల కాలనీలు శుభ్రపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓఐ సునీల్ కుమార్, అధ్యాపకులు సతీష్, సురేష్, కోటేశ్వరరావు, బంగారు వెంకట్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రవాస యోజన



కరపత్రాలు అంటిస్తున్న బీజేపీ నేతలు

ఇందుకూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరులోని బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల ప్రవాస యోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మండల ఇన్‌చార్జ్ ఆలూరు నాగమణి పాల్గొని మండల కమిటీ, పోలింగ్ బూత్ కమిటీలు, శక్తి కేంద్ర ప్రముఖులతో చర్చించారు. జనతా వారధి ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేయడం ప్రతి ఇంటికి స్వదేశీ కార్యక్రమం కరపత్రాలు పంచి ఇళ్ల గోడలపై అంటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నెట్రంబాక శివప్రసాద్, మండల ఉపాధ్యక్షులు నెల్లూరు శ్రీనివాసులు, వెంకటకృష్ణ, సునీల్, అహ్మద్, ప్రభాకర్, లలితమ్మ, రఘురామ్‌రెడ్డి, కిషోర్, తువ్వర రాంబాబు, వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుద్దముక్కపై జాతీయ జెండా, బంకింగ్ చంద్రుడి చిత్రాలు



మనుబోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంకింగ్ చంద్ర చటర్జీ వందేమాతరం గీతం రాసి 150 సంవత్సరాలు. ఈ సందర్భంగా బుధవారం సూక్ష్మ కళాకారుడు, వీరంపల్లి ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం సుద్దముక్కపై జాతీయజెండా, గీత రచయిత చిత్రాన్ని నీటి రంగులతో చిత్రీకరించి, ప్రదర్శించి వందే మాతరం గేయ ప్రాధాన్యం గురించి తెలియజేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

బడి నుండే భవితకు భరోసా..!

- పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా కోర్సులు
- 49 ప్రభుత్వ పాఠశాలల్లో 10 రకాల కోర్సులకు శిక్షణ
- 'సర్వశిక్ష' ఆధ్వర్యంలో పర్యవేక్షణ



బ్యూటీషియన్ కోర్సులో బాలికలకు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

మనుబోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో చదువు ఒక్కటే ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు చదువుతో పాటు వృత్తివిద్యాకోర్సులలో నైపుణ్యాలు నేర్పించాలని చర్యలు చేపట్టారు. వృత్తివిద్యాకోర్సులు నేర్చుకోవడం వల్ల పై చదువులకు ఉపయోగపడడంతోపాటు జీవితంలో స్వయం ఉపాధి పొందడానికి తోడ్పడుతాయి. ప్రభుత్వం వీటికి ప్రాధాన్యం ఇస్తూ కోర్సులకు అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసింది.

49 పాఠశాలల్లో అమలు

సమగ్రశిక్ష అధికారుల ఇచ్చిన సమాచారం మేరకు.. జిల్లాలోని వివిధరకాల 49 పాఠశాలలో వృత్తివిద్యా కోర్సులు అమలు చేస్తున్నారు. ఇందులో 5 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, 11 ఏపీ మోడల్ స్కూల్స్, 8 ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐ పాఠశాలలు, 21 ఎంపీపీ జడ్పీ స్కూళ్లు, మున్సిపల్ ఒకటి, 2 ప్రభుత్వ స్కూళ్లు, ఏపీఆర్ ఐఈఎస్ పాఠశాల ఒకటిలో 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు వృతివిద్యా కోర్సులలో శిక్షణ ఇస్తున్నారు.

10కోర్సులు... 103 మంది శిక్షకులు

వృత్తివిద్యాకోర్సులు అమలు చేస్తున్న 49 పాఠశాలలో 10రకాల ట్రేడులలో అంటే కోర్సులలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఆటోమోటివ్, అపెరల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్ వ్యాపారం, ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్, ఐటీ, ఆహారశుద్ధి, విఎఫ్ఎస్ఐ, వ్యవసాయ అంశాలలో ఇంటర్నషిప్ నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులలో నైపుణ్యాలు పెంచేందుకు 103 మందిని ప్రత్యేక శిక్షకులను ఏర్పాటుచేశారు. 49 పాఠశాలలో జిల్లాలో ఈ వృత్తివిద్యాకోర్సుల కింద 10వేల నుంచి 12 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సమగ్రశిక్ష శాఖ ఈ కోర్సులకు అవసరమైన వసతులను, శిక్షకులను, పరికరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తోంది. ఒక్కో ట్రేడ్‌లో శిక్షణ ఇచ్చే శిక్షకులకు పిల్లలకు కోర్సులపై అవగాహన, ప్రాక్టికల్స్ రవాణా, భోజన నదుపయాల కొంద రూ. 10 వేలు ప్రభుత్వం ఇస్తుంది.

'అందమైన' కోర్సుతో ఉపాధి

ప్రస్తుత సమయంలో బాలికలకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ వొకేషనల్ కోర్సుతో ఎంతో ఉపయోగం. ఇవి నేర్చుకుంటే బాలికలకు నివసించే పరిసరాల్లోనే బ్యూటీ పార్లర్, లేడీస్ కార్నర్, ఫ్యాన్సీ షాపులు పెట్టుకుని ఉపాధి పొందవచ్చు. పైగా ఇంట్లోనే ఉంటూ వీటిని నడుపుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఈ కోర్సు పట్ల ఎక్కువగా బాలికలు ఆసక్తి చూపుతున్నారు. మేము కూడా అదే స్థాయిలో శ్రద్ధతో శిక్షణ ఇస్తున్నాం.

- కృష్ణవేణి, శిక్షకురాలు

జీవిత ప్రయాణానికి ఉపయుక్తం



బాలబాలికల జీవిత ప్రయాణానికి వృత్తివిద్యా కోర్సులు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. ఈ కోర్సుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అన్ని విధాలా సహకరిస్తోంది. కోర్సుల నిర్వహణకు అవసరమైన ల్యాబ్‌లు, పరికరాలను సరఫరా చేసింది. చదువు పూర్తయ్యే సరికి విద్యార్థులు ఈ కోర్సులు పూర్తి చేసుకుని, ధృవీకరణపత్రాలు కూడా పొందుతారు. వీటి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

- వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్ష

సమగ్ర పంటల యాజమాన్యంపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ రఘునాథరెడ్డి

ఇందుకూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో అభ్యుదయ (ఛాంపియన్స్ ఫార్మర్స్) రైతులకు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై ఏడీఏ రఘునాదరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందుకూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని ఇందుకూరుపేట, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లోని గ్రామ పంచాయతీకి ఒక రైతు చొప్పున ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్‌రావు పాల్గొని అభ్యుదయ రైతులకు పలు సూచనలు చేశారు. కొత్త వ్యవసాయ పద్ధతులు, కొత్తవంగడాలు, ప్రకృతి వ్యవసాయం, పెట్టుబడి లేని వ్యవసాయం గురించి అభ్యుదయ రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ పరిధిలోని అన్నీ రకాల వ్యవసాయ పథకాలు, వ్యవసాయానికి అవసరమైన అన్నీ రకాల జెనెటిక్ విత్తనాలు మేలైన సాగు పద్ధతులు గురించి వివరించారు. పశుసంవర్ధక వ్యవస్థలో అధిక పాల దిగుబడి ఇచ్చే రకాలు, వ్యాధుల నివారణ గురించి తెలియజేశారు. చేపలు, రొయ్యల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు జ్యోత్స్నరాణి, వి శిరీషరాణి, కె రెడ్డి ప్రసన్న, వై ప్రేమలత, జి మధురిమ, డాక్టర్ సీహెచ్ శ్రీలక్ష్మీ, డాక్టర్ మధుసూదన్, వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ అస్లామత్తర్ తదితరులు పాల్గొన్నారు.

మాకిదేం దుస్థితి.. విఘ్నేశ్వరా!

పదిరోజులుగా డ్రైనేజీ చెత్త రోడ్డుపైనే..



కాలువల్లో నుంచి తీసి రోడ్డుపై పడేసిన చెత్త

పొదలకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విఘ్నేశ్వర కాలనీలో డ్రైనేజీ కాలువలు నుంచి తీసిన చెత్త గత పది రోజులుగా అలానే ఉంది. ఇప్పటికే విఘ్నేశ్వరకాలనీలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు అధికంగా ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ఈ వర్షాల నేపథ్యంలో డ్రైనేజీ కాలువల నుంచి తీసిన వ్యర్థాలు, చెత్తాచెదారాలు రోడ్లపైన అలాగే ఉండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ చెత్తను తొలగించాలని పలుమార్లు పంచాయతీ సిబ్బందికి, అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటి కైనా స్పందించి డ్రైనేజీ కాలువ నుంచి తీసిన వ్యర్థాలను తొలగించాలని వారు అధికారులను కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

వింజమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని బొమ్మరాజుచెరువు గ్రామంలో బుధవారం ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ సీహెచ్‌వి సుబ్బారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ బి హరీష్, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, సీఈవో మేకల రమణయ్య యాదవ్, డైరెక్టర్ గని శ్రీనివాసనాయుడు కార్యక్రమానికి విచ్చేసి ప్రత్యేక డిపాజిట్ పథకాలను, తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం శ్రీనివాసులురెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉదయగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించా లని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు సూచిం చారు. గురువారం పట్టణంలోని ఎన్‌బీ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భం గా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

అక్కడ ఆనందం.. ఇక్కడ ఆక్రోశం!

- తుఫాన్ సరుకుల పంపిణీలో గందరగోళం



మడమనూరులో సరుకులు అందుకుంటున్న చేనేతలు



మనుబోలులో ఆందోళన చేస్తున్న చేనేత కార్మికులు

మనుబోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ రెండు చిత్రాల్లో ఉన్నది మండలంలోని చేనేత కార్మికులే. ఒక చిత్రంలో చేనేత కార్మికులు ఆనందంతో సరుకులు అందుకుంటుండగా, మరో చిత్రంలో తమకు ఇవ్వలేదంటూ ఆక్రోశంతో ఆందోళన చేస్తున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే ఇటీవల వచ్చిన మోంథా తుఫాన్ సాయం కింద చేనేత కార్మికులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు పంపిణీ చేయమని ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లా హ్యాండ్‌లూమ్ కార్యాలయం మండలంలోని మడమనూరు, జట్లకొండూరు గ్రామాల్లో ఉన్న 94 చేనేత కుటుంబాల జాబితా మాత్రమే డిఎస్‌వోకు పంపడంతో ఆ కుటుంబాలకు రేషన్ డీలర్లు బుధవారం సరుకులు అందజేశారు. అయితే మనుబోలు, చెర్లోపల్లి గ్రామాల్లో ఉన్న చేనేత కార్మికులు తమకెందుకు తుఫాన్ సరుకులు ఇవ్వరంటూ, ఇది అన్యాయమంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ఇందులో తమ ప్రమేయం లేదని, జిల్లా డిఎస్‌వో కార్యాలయం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ గ్రామాలకు మాత్రమే పంపిణీ చేశామని చెబుతున్నారు. జిల్లా హ్యాండ్‌లూమ్ కార్యాలయం మిగిలిన నేతన్నలకు సరుకులు ఇస్తుందో, లేదో మరి.

ఇరవై ఏళ్లుగా ఎదురుచూపులే..!

- అందని ఉప్పు భూముల పరిహారం



రైతుల నుంచి సేకరించిన కృష్ణపట్నం ఉప్పు భూములు

ముత్తుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంతా అయిపోయింది.. ఇక ఉత్తర్వులు రావడమే తరువాయి.. అని చెప్పడమే తప్ప, ఉప్పు భూముల పరిహారం చేతికందలేదు. హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు మారాయి... ప్రజాప్రతినిధులు.. అధికారులు మారారు.. కానీ కృష్ణపట్నం ఉప్పు రైతుల తలరాత మాత్రం మారలేదు. ఇరవై ఏళ్లుగా కృష్ణపట్నం ఉప్పు రైతులు పరిహారం కోసం ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు. ఇదిగో వస్తుంది.. అదిగో ఇస్తారు అంటూ ప్రతి ఏటా ఉప్పు రైతులను ఊరిస్తూనే ఉన్నారు. కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి కోసమని 2006లో కృష్ణపట్నం సాల్ట్ సొసైటీ పరిధిలో ఉన్న 970 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో పోర్టు అభివృద్ధికి గోపాలపురం పరిధిలో ఉన్న ఈ భూములు అవసరమని పోర్టు నిర్వాహకులు భావించారు. అయితే అప్పట్లో సాల్ట్ సొసైటీ ఈ భూములకు బదులుగా మరో ప్రాంతంలో ఉప్పు పండించే భూములను చూపించి రైతులకు తగిన పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. దీంతో కొంతకాలం ఉప్పు భూముల సమస్య పెండింగ్‌లో పండింది. అనంతరం ఉప్పు భూములకు ధర చెల్లించి స్వాధీనం చేసుకునేందుకు పోర్టు యాజమాన్యం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే పరిహారం ఇచ్చేదాకా తమ భూములను అప్పగించబోమని ఉప్పు రైతులు తేల్చి చెప్పారు. ఆ భూముల్లో ఉప్పు పండిస్తూ కొద్ది సంవత్సరాలు జీవనం సాగించారు. బొగ్గు కాలుష్యం కారణంగా పండించిన ఉప్పు పాడైపోతుండడంతో రైతులకు కొంతకాలం పోర్టు యాజమాన్యం నష్టపరిహారం చెల్లిస్తూ వచ్చింది. ఆ తర్వాత మార్కెట్ ధర ప్రకారం భూముల ధర నిర్ణయించి, ఆ మొత్తాన్ని ప్రభుత్వంకి చెల్లించామని, కృష్ణపట్నం పోర్టు ఉప్పు భూముల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించారు. అప్పటి నుంచి భూముల పరిహారం సమస్య అపరిష్కృతంగానే ఉంది. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నవయుగ చేతి నుంచి అదాని కంపెనీకి మారడంతో ఉప్పు భూముల పరిహారం విషయం కొలిక్కి వస్తుందని అంతా భావించారు. ఎన్నో ఏళ్లుగా తాము చూస్తున్న పరిహారం చేతికందుతుందనుకున్నారు. అయితే అదానీ కంపెనీ యాజమాన్యం కృష్ణపట్నం పోర్టును స్వాధీనం చేసుకుని ఆరేళ్లవుతున్నా, ఇప్పటికీ భూముల పరిహారం సమస్య కొలిక్కి రాలేదు. ఉప్పు రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్న పోర్టు యాజమాన్యం హామీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ఉప్పు రైతుల సమస్యను పరిష్కరించి పరిహారం చెల్లించాలని ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ అజిత వేజెండ్ల



పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

కోవూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి పెట్టినట్లు ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీసుస్టేషన్‌లో సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. సర్కిల్ కార్యాలయ పరిధిలో పరిస్థితులను సీఐ సుధాకర రెడ్డి ఎస్పీకి వివరించారు.

కనిగిరి కాలువలో మృతదేహం

- మృతుడు నెల్లూరు నగర వాసిగా గుర్తింపు



మృతుడు మనోజ్ (ఫైల్)

సంగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపు వద్ద కనిగిరి ప్రధాన కాలువ నీటిలో ఓ వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వ్యక్తి మృతదేహాన్ని, స్కూటీని నీటిలో నుంచి గట్టుకు చేర్చారు. స్కూటీ నెంబరు ఆధారంగా నెల్లూరు వాసి మనోజ్ (57)గా పోలీసు లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసు ల సమాచారం మేరకు.. మృతుడు నెల్లూరులోని వేదాయపాళెంలో నివాసం ఉంటున్నాడు. భార్య పేరు మాధవి. వీరికి పిల్లలు లేరు. చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఓ పని పరిశీలన నిమిత్తం వెళ్తున్నట్లు భార్య మాధవికి చెప్పి స్కూటీపై బయలుదేరాడు. ఇతనితోపాటు వీరి డ్రైవర్ మనోజ్ కుమార్ కూడా వచ్చాడు. అయితే మండలంలోని రాంపు వద్దకు వచ్చిన తరువాత నేను ఒక్కడినే వెళ్లి వస్తాను... నువ్వు వెళ్లిపోమని డ్రైవర్‌ను బస్సు ఎక్కించాడు. అప్పటి నుంచి మనోజ్ ఆచూకీ కనిపించలేదు. అయితే గురువారం ఉదయం స్కూటీతో పాటు మనోజ్ మృతదేహం కాలువ నీటిలో లభ్యమయింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని, స్కూటీని బయటకు తీశారు. పోస్టుమర్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి మద్యం అలవాటు లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పోలీసులు ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. ఆత్మహత్యా లేక హత్యా అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

రైలు పట్టాలపై..

కావలి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడు సమీపంలో ఎగువభాగాన రైలు పట్టాలపై గురువారం తమిళనాడుకు చెందిన శంకర్ (29) మృత దేహాన్ని కీ మెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు తెలిపాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకట్రావ్ మృతదేహాన్ని పరిశీలించి మృతుని వద్ద లభించిన ఆధారాల మేరకు తమిళనాడువాసిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం సాయంత్రం తాడేపల్లి నుండి చెన్నై సెంట్రల్‌కు రైల్లో వెళ్తూ జారిపడి మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ములుముడి గ్రామంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు నెల్లూరు రూరల్ సీఐ వేణు తెలిపారు. నగరంలోని బీవీనగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌ను ఇటీవల ములుముడి గ్రామంలో చాకుతో పొడిచి రక్తగాయాలు చేసిన ఘటనలో నిందితుడు కుండా ప్రేమ్‌కుమార్ అని సీఐ తెలిపారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

6 సవర్ల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం బంగ్లాతోటలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు బంగ్లాతోటలో రఫీ కుటుంబం నివసిస్తోంది. ఆయనపై అంతస్తులో ఉంటుండగా కుటుంబ సభ్యులు కింద పోర్షన్‌లో ఉంటున్నారు. బుధవారం మనుమరాలికి అనారోగ్యంగా ఉండటంతో ఆయన ఆసుపత్రికి తీసుకెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చి కింద పోర్షన్‌లో నిద్రపోయారు. ఈ క్రమంలో గురుతెలియని దుండగులుపై అంతస్తు గది తాళాలు తెరిచి ఆరు సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గురువారం బాధితుడు నవాబు పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

సీతారామపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎల్వీఆర్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణప్ప పేట గ్రామానికి చెందిన తలారి విజయ్ సాగర్ అనే బాలుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణప్పపేట నుంచి పాల ఆటో సీతారామపురానికి వస్తూ మార్గమధ్యంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న కూరగాయల ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో పాల ఆటోలో ప్రయాణిస్తున్న విజయసాగర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ఎక్కడ ?

చిన్నపాటి బోర్డు కూడా కనిపించని వైనం



నివాసం వద్ద కనిపించని వైద్యశాల బోర్డు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువు విలేజ్ హెల్త్ క్లినిక్ జాడ తెలుసుకునేందుకు ప్రజలు, రోగులకు తిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నూతన భవనం మంజూరైనప్పటికీ పనులు చేపట్టక పోవడంతో పునాదుల దశలోనే వెక్కిరిస్తోంది. దీంతో గ్రామంలోని ఓ నివాసాన్ని అద్దెకు తీసుకొని కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడ కనీసం చిన్నపాటి బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇతర గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చిన రోగులు ఆ కేంద్రానికి వెళ్లేందుకు దారి పొడవునా ఆరా తీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్ సమాచారం ప్రజలకు తెలిసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
కోడిగుడ్ల ధర (100):	585



అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి, అమ్మవారి ఉత్సవర్లు



గణేష్ ఘాట్‌లో జరిగిన సామూహిక సత్యనారాయణ వ్రతానికి హాజరైన దంపతులు, చిత్రంలో దీపా వెంకట్

శ్రీసత్యదేవాయనమః

- భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్వర్ణాల చెరువు తీరాన గణేష్ ఘాట్‌లో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో మహా కార్తీక దీపోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి తరలివచ్చిన ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, ఆ దేవస్థానం పండితులు భక్తులతో శాస్త్రోక్తంగా వ్రతం జరిపించారు. సుమారు 600 మంది దంపతులు పాల్గొన్నారు. సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యం లో 150 మంది గిరిజన దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నవరం సత్యదేవుని దర్శనం కల్పించి, వ్రతం జరిపించడం స్వామి వారి కృప అని స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ అన్నారు. సింహపురి దీపోత్సవ సమితి కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు ఆనం శుభకర్ రెడ్డి దంపతులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ సురేంద్రరెడ్డి దంపతులు, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కే వెన్నెల, కార్యదర్శి బయ్యా మల్లిక తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ముక్కంటి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్స వాల్లో గురువారం రాత్రి ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు జరి గాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకారం జరిగాయి.



ఉత్సవాలకు రావాలని ప్రచారం చేస్తున్న భక్తులు

రామాలయంలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జ్యోతినగర్ 8వవీధిలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత అంజనేయస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, జలాధివాసము జరిగాయి. ఈ ఉత్సవాలకు అందరూ తరలిరావాలని కోరుతూ భక్తులు అయ్యప్పగుడి కూడలి వరకు ప్రచారం చేశారు. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిటీ చైర్మన్ ఎల్‌పీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ శివరామ్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

ఇంటర్వ్యూ

పోలీసులు, ఏసీబీ అంటూ

ఫోన్లు చేస్తే నమ్మొద్దు

- ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దు
- నెల్లూరు రూరల్ సీఐ వేణు



సైబర్ క్రైం విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగులు ఆ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. పోలీసులం, ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా ఫోను చేస్తే నమ్మొద్దని, ఏపీకే పేరిట వచ్చే ఫైల్స్‌ను ఓపెన్ చేయొవద్దని సూచించారు. సైబర్ నేరాలపై ఆయన ఆంధ్రజ్యోతికి పలు వివరాలు వెల్లడించారు.

? సైబర్ నేరగాళ్లు మనపై వల విసిరినట్లు ఎలా తెలుస్తుంది.

! మన ఫోన్లకు వచ్చే కాల్స్ నమ్మకమైన వైతేనే లిఫ్ట్ చేయాలి. అనుమానిత కాల్స్ తీయకపోవడం ఉత్తమం. మన వాట్సాప్ నెంబర్లకు కొన్ని లింకులు వస్తుంటాయి. వాటిలో కొన్నింటికి ఏపీకే అని ఉంటుంది. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు. అలా చేస్తే మన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డేటా అంతా వాళ్లకి వెళ్లిపోతుంది.

? సైబర్ నేరగాళ్ల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి.

! ఏటీఎం కేంద్రాల నుంచి డబ్బు డ్రా చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. మిషన్ నుంచి డబ్బు తీసుకోవడం తెలియకపోతే అక్కడున్న సెక్యూరిటీ గార్డును అడగాలి. పరిచయం లేని వారి సహాయం తీసుకోక పోవడం మంచిది. కొందరు మేము సహాయం చేస్తామంటూ నమ్మించి వాళ్ల డబ్బు కాజేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

? విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి అవగాహన అవసరం

! వాళ్లను సైబర్ నేరగాళ్లు ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. తాము పోలీసులమని, ఏసీబీ అధికారులమని చెప్పి ఫోన్ చేస్తున్నారు. మీపైన పాత కేసులున్నాయని, వాటి విషయమై మాట్లాడాలంటూ భయపెడుతున్నారు. పాత కేసులుంటే సదరు పోలీసు స్టేషన్లకు పిలిచి మాట్లాడతారే తప్ప నిజమైన అధికారులెవరూ ఫోన్లలో కేసుల గురించి మాట్లాడరు. ఈ విషయాన్ని రిటైర్డ్ ఉద్యోగులు గుర్తించాలి. ఎవరైనా అలా ఫోన్లు చేస్తే వివరాలు తెలుసుకోవాలి.

? సైబర్ దాడికి గురైన వారు తక్షణం చేయాల్సింది.

! సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న వారు వెంటనే 1030 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు చెప్తే ఆర్థిక లావాదేవీలు తక్షణం నిలిపివేస్తారు. వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అలాగే సదరు బ్యాంకుకు సమాచారం అందించాలి. అప్పుడే సైబర్ నేరగాళ్లు దోచుకున్న నగదును రికవరీ చేయగలం.

? మైనర్లపై నేరాలను నిలువరించేదెలా...

! ప్రధానంగా అవగాహన లోపం. వారిలో చైతన్యం లేకపోవడం. ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఇటు తల్లిదండ్రులు, అటు టీచర్లు అవగాహన కల్పించాలి. పోలీసు శాఖ ద్వారా కూడా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్రగతి చారిటీస్‌కి రూ.50వేల విరాళం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ సీబీఎస్ స్కూల్ అకడమిక్ డీన్ కళాకృష్ణస్వామి ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రగతి చారిటీస్ ఆశ్రమానికి గురువారం రూ.50వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అక్కడి బాలలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య, సూరిశెట్టి ఉమా సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక సవాళ్లను నైపుణ్యతతో ఎదుర్కోవాలి

- కేఎల్‌యూ డైరెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను నైపుణ్యతతో ఎదుర్కోవాలని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్దనున్న శ్రీచైతన్య కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో నైపుణ్య ప్రణాళిక ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల డీన్ శ్రీరామ్, ప్రిన్సిపాల్ శ్రీధర్, దిలీప్‌కుమార్, సురేష్‌బాబు, ఇంతియాజ్, యూనివర్సిటీ అడ్మిషన్ ఇన్‌చార్జి షణ్ముఖ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా ఉంటే ఊస్టింగే!

- డ్రైవర్లకు నగర కమిషనర్ హెచ్చరిక

నెల్లూరు(సిటీ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా డ్రైవర్లుగా పనిచేస్తున్న వారు బాధ్యతగా నడుచుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని కమిషనర్ నందన్ హెచ్చరించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ చెత్త వాహనాలు నడిపే డ్రైవర్లతోపాటు అధికారుల వద్దనున్న డ్రైవర్ల హాజరు సక్రమంగా ఉండాల న్నారు. దీర్ఘకాలం సెలవులో ఉండటం, విధుల్లో నిర్లక్ష్యాన్ని గుర్తిస్తే చర్యలు తప్పవన్నారు. అనం తరం బ్యాంకు అధికారులతో సమీక్ష జరిపారు. టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

ప్లానింగ్ సెక్రటరీకి షోకాజు నోటీసు

నగరంలోని 9వ డివిజన్ 3వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పని చేస్తున్న బీ తిరుపాలుకు కమిషనర్ షోకాజు నోటీసు జారీ చేశారు. ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్డును గమనించిన ఆయన, అందుకు రాత పూర్వక వివరణ ఇవ్వాలని సెక్రటరీని ఆదేశించారు. పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు పెంచల నరసయ్య మాట్లాడుతూ సమ్మె కాలం నాటి జీతం వెంటనే చెల్లించాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలతో కూడిన ఉద్యోగ విరమణ అవకాశం కల్పించాలన్నారు. విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సుజాతమ్మ, దేశమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని ఆ శాఖ జేఏసీ కోరింది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎన్‌జీవో జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ విద్యాసాగర్‌కి నెల్లూరు జిల్లా శాఖ ఉద్యోగులు గురువారం వినతి పత్రం అందజేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు పదవీ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, గృహ నిర్మాణ సంస్థపై జరిగిన విజిలెన్స్ విచారణకు సంబంధించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా వర్కింగ్ చైర్మన్ ఎస్‌వీఎం మనోజ్‌కుమార్, రాష్ట్ర ఏఈ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీ వెంకటేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కేసీ పెంచలయ్య, నెల్లూరు జిల్లా అవుట్ సోర్సింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎన్‌జీవో జేఏసీ చైర్మన్ విద్యాసాగర్‌తో జిల్లా అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సంఘం నాయకులు

గిరిజనులకు నిత్యావసర సరుకుల వితరణ

- కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పంపిణీ

ఓజిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం గ్రద్దగుంట గిరిజనులకు గురువారం కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఆ ట్రస్ట్ నిర్వాహకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి నేతృత్వంలో ఆయన సోదరుడు వేలూరు సాయిగిరిధర్‌రెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మల్లిశెట్టి శివప్రసాద్ చేతులమీదుగా వీటిని అందజేశారు. ఇటీవల సంభవించిన మొంథా తుపాను, అనంతర వర్షాలతో ఇబ్బంది పడుతున్న 40 గిరిజన కుటుంబాలను గురువారం కల్యాణ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదుకు న్నారు. 14 రకాల నిత్యావసర సరుకులు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్ చారిట బుల్ ట్రస్ట్ సభ్యులు సునీల్, చెంచయ్య, నాయకులు పాల్గొన్నారు.



గ్రద్దగుంట గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సాయిగిరిధర్‌రెడ్డి, శివప్రసాద్

బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందని, ఈ విషయంలో అధికారిని బదిలీ చేయడం తప్ప విధుల నుంచి తొలగించడం లేదని ఆరోపించారు. వెంటనే ఆ అధికారిని విధుల నుంచి తొలగించకపోతే ప్రజాపోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి యామల మధు, నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, లీలామోహన్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వంద ఎలక్ట్రికల్ బస్సులు

- నెల్లూరు-2 డిపోకి కేటాయింపు
- గ్యారేజ్‌లో 25 చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు
- ఇతర డిపోల్లోనూ చార్జింగ్ పాయింట్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-బస్ సేవ కింద మొదటి దశలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు చేసింది. వీటిలో నెల్లూరు జిల్లా ఆర్టీసీ రెండవ డిపోకు 100 బస్సులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. మొదటి విడత టెండర్లలో పూణెకు చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ బస్సుల కాంట్రాక్టు దక్కించుకుంది. వచ్చే ఏడాది మొదటి మూడు నెలల్లోనే జిల్లాకు 100 ఎలక్ట్రికల్ బస్సులు పూర్తిస్థాయిలో చేరుకోనున్నాయి. ఎలక్ట్రికల్ ఏసీ, నాన్ ఏసీ బస్సులు జిల్లాకు చేరుకుంటే నెల్లూరు నుంచి చెన్నై, విజయవాడ, తిరుపతి ఇతర ప్రాంతాలకు బస్సులను నడపనున్నారు.



రూ.1.5 కోట్లతో చార్జింగ్ స్టేషన్

నెల్లూరు 2వ డిపో ఆధ్వర్యంలో తిరుపతి డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను నెల్లూరు-తిరుపతి మధ్య నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నారు. ఈ బస్సుల కోసం 2వ డిపోలోని గ్యారేజ్‌లో చార్జింగ్ స్టేషన్‌ను నిర్మించి చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక జిల్లాకు రానున్న 100 ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజ్‌లోనే 25 చార్జింగ్ పాయింట్లతో భారీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటుకు జిల్లా ఆర్టీసీ అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చార్జింగ్ స్టేషన్‌లో మరికొన్ని చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రస్తుతం గ్యారేజ్‌లో బస్సులను శుభ్రపరిచే వాటర్ వాషింగ్ పాయింట్‌లోనూ భారీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. 25 చార్జింగ్ పాయింట్లతో ఏర్పాటు చేసే ఈ స్టేషన్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఇక కావలి, కందుకూరు డిపోల్లోనూ చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అన్నం శ్రీనివాసులుకు నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నరుకూరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు అన్నం శ్రీనివాసులు మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి బీజేపీ నాయకుడు, ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. పార్టీ కోసం పనిచేసిన శ్రీనివాసులు మృతి బాధాకరమన్నారు.

గ్యాస్టిక్ క్యాన్సర్‌పై అవగాహన

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్టిక్ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చని మెడికవర్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రంగరామన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు నెలను గ్యాస్టిక్ క్యాన్సర్ అవగాహన నెలగా పరిగణిస్తారని, ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జీవనశైలీలో మార్పు, ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారం తినడం, మాసాలాలు, మద్య, ధూమపానం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని తెలియచేశారు.

దోమల నివారణకు కాలువల్లో ఆయిల్ బాల్స్

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47,48వ డివిజన్లలో దోమల నివారణకు గురువారం ధర్మవరం టీం ఆధ్వర్యంలో కాలువల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. కుక్కలగుంట, రాజేంద్రనగర్, ఉయ్యాలకాలువ, మహాలక్ష్మమ్మ గుడి, మసీదు సెంటర్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్, విజయలక్ష్మి, పూజారి సారిక, రాజేశ్వరి, రత్నమ్మ, కల్వకుంట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

- డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ

నెల్లూరు (వైద్యం) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, ఆ దిశగా తాము చర్యలు తీసుకుంటామని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ వెల్లడించారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జాకీర్ హుస్సేన్ నగర్, ఎన్టీఆర్‌నగర్, బాలాజీనగర్‌లో డీవైఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతలో ఐక్యత, అభ్యున్నతి, దేశభక్తిని పెంపొందించేలా కృషి చేస్తామని చెప్పారు. తక్షణమే జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, తిరుపతి, జగదీష్, సురేంద్ర, కల్యాణ్, రాహుల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో కోడిగుడ్ల పంపిణీ

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీ రావు 90వ జయంతి సందర్భంగా ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం ఉచితంగా కోడిగుడ్లు పంపిణీ చేశారు. కోడిగుడ్లులోని పోషక విలువలు తెలియచేస్తూ వాకర్స్ క్రీడాకారులకు కరపత్రాలను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి కోసం కరపత్రాల విడుదల

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చింతారెడ్డిపాళెం కూడలిలో జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని ఆ వంతెన సాధన పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆదిత్య నగర్ పిల్లల పార్కు వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, విశ్రాంత ఏఎస్పీ రాంబాబు పాల్గొన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ఆ ప్రాంతంలో అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి పోరాట కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ వంతెన కోసం 16 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ నెల 16న మానవహారం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, కోట గురుబ్రహ్మం, శంకర్, సురేష్, కట్టా సతీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వారు కట్టడం.. వీరు కూల్చడం!

నగరంలో కబ్జాదారులు రోడ్డు స్థలాలను ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తూ వెళుతుంటే కార్పొరేషన్ అధికారులు వాటిని కూల్చుకుంటూ వస్తున్నారు. తాజాగా 54వ డివిజన్ వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీ వద్ద రోడ్డు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను సిటీ ప్లానింగ్ అధికారులు గురువారం నేలమట్టం చేశారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)



'నారాయణ'లో జాతీయ నర్సింగ్ సదస్సు

- నర్సింగ్ సేవలు ఎంతో కీలకం : ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో నర్సింగ్ విద్యార్థుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. నావిగేషన్ ఆఫ్ నర్సింగ్ ఇన్నోవేషన్స్ - చాలెంజస్ - ఫ్యూచర్ డైరెక్షన్ అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు జరిగే ఈ సదస్సులో తొలిరోజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఉపన్యసించారు. వైద్య రంగంలో నర్సింగ్ సేవలు ఎంతో కీలకమన్నారు. 75 శాతం వ్యాధులు నర్సుల వల్లనే నయం అవుతుంటాయని చెప్పారు. నారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజ కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలతోపాటు అనేక ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల నుంచి ఎంతో మంది నిపుణులు వచ్చి ఈ సదస్సులో ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సదస్సులో కార్యనిర్వాహక సభ్యులు ప్రతిమ, ఉషాకిరణ్, తేజోవతి, నారాయణ వైద్య కళాశాలల ఆపరేషన్స్ హెడ్ రామారావు, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, అకడమిక్ డీన్ డాక్టర్ శివకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకర్, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శివపార్వతుల సెట్టింగ్‌ను దర్శించుకుంటున్న భక్తులు

కార్తీక మాసంతో పరోపకారం

● ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ● వీఆర్సీ మైదానంలో వైభవంగా కార్తీక లక్ష దీపోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం విశిష్టమైనదని, ఈ మాసంలో మానవులు పరోపకార సేవను నేర్చుకుంటారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో కార్తీక మాస లక్షదీపోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మూడు రోజులు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఉదయం నాగేశ్వర జ్యోతిర్లింగ ఆలయం, పండరినాథ స్వామి ఆలయం నమూనాతో ఏర్పాటు చేసిన మందిరాల్లో కలిశ స్థాపన జరిగింది. వేద పండితులు మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కేరళ కళాకారులతో కార్తీక మాస లక్ష దీపోత్సవం ప్రారంభమైంది. విశిష్ట అతిథులుగా విశాఖ శ్రీసౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీస్వామి, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు హాజరయ్యారు. వారు వేమిరెడ్డి దంపతులతో కలసి ఆకాశ దీపం వెలిగించారు. అఖండ దీప ప్రజ్వలనతో లక్ష కార్తీక దీపారాధనను ప్రారంభించారు. నగరమంతా ఏర్పాటుచేసిన మైకులలో శివ నామ స్మరణ మారుమోగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు ప్రవచిస్తూ జగత్తులోని 84 లక్షల జీవరాసులను మానవుడు వాడుకుంటాడని, వాటి నుంచి ఎన్నో నేర్చుకుంటాడని చెప్పారు. జీవరాసుల్లోకి కృతజ్ఞత కలిగిన జీవి పక్షి అని తెలిపారు. కార్తీక మాసంలో సూర్యాస్తమయం త్వరగా జరుగుతుంది కనుక చీకటి పడే సమయంలో పక్షులు తమ గూటికి చేరుకునేందుకు మానవులు ఆకాశ దీపాన్ని వేలాడదీస్తారని వివరించారు. వేమిరెడ్డి దంపతులు విద్యా, వైద్యం, తాగునీరు, అన్నప్రసాదం, నేత్ర వైద్యం, క్యాన్సర్ వైద్యం వంటి సేవలను పరోపకారంగా అందిస్తుండటాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీనాయుడు, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, ఎస్‌వీఎస్ రాఘవేంద్రరావు, కోడూరు కమలాకర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వేదికపై ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు, పక్కన ఎంపీ వేమిరెడ్డి దంపతులు


కార్తీక దీపోత్సవానికి హాజరైన భక్తులు

ఆటోను ఢీకొట్టిన కారు

- 15 మంది గాయపడగా.. వీరిలో పదిమంది మహిళలే
- మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికి వస్తుండగా ప్రమాదం


ప్రమాదంలో గాయపడి హైవేపై పడి ఉన్న మహిళలు

ఉలవపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఓ కారు ఆటోను ఢీకొనడంతో 10 మంది మహిళలతోపాటు ఆటో డ్రైవర్, మరో నలుగురికి గాయాలు అయ్యాయి. నెల్లూరు జిల్లా దగదర్తిలో దివంగత మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించడానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వస్తున్నారని, నియోజకవర్గం మీదగా వెళుతున్న ఆయనకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం అయ్యాయి. గుడ్లూరు మండలం మోచర్ల హైవే వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ శ్రేణులతో కలిసి లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఓ ఆటో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని ఉలవపాడు హెచ్‌పీ పెట్రోల్ బంకులో డీజిల్ పట్టుకుని హైవే ఎక్కే క్రమంలో ఒంగోలు వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొనడంతో బోల్తాపడింది. డ్రైవర్‌తోపాటు ఆటోలోని 10 మంది మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. రావినూతల బేబి ప్రసన్న, రావినూతల లక్ష్మికి కాళ్లు విరిగాయి. వీరిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, తలకు, చేతులు, కాళ్లకు గాయాలైన మహిళలను ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని కందుకూరు సీఐ అన్వర్ బాషా, ఎస్ఐ అంకమ్మ చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారులో ఆరుగురు ప్రయాణిస్తుండగా నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మాలేపాటి సుబ్బానాయుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి లోకేష్ తదితరులు

మాలేపాటి కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత నాది!

- ఓ మంచి నాయకుడిని పార్టీ కోల్పోయింది
- వేధించిన వారిపై చర్యలు తప్పవు ● మంత్రి నారా లోకేష్

కావలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ దివంగత మాలేపాటి సుబ్బానాయుడి కుటుంబానికి టీడీపీ అండగా నిలిచి, వారిని రాజకీయంగా ముందుకు తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఇటీవల అనారోగ్యంతో మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడి కుమారుడు భాను చందర్ మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మంత్రి లోకేష్ దగదర్తిలోని మాలేపాటి నివాసానికి వెళ్లారు. తొలుత మాలేపాటి సుబ్బానాయుడు చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ సుబ్బానాయుడు టీడీపీకి ఎనలేని సేవలు అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2014 వరకు కావలి టీడీపీ ఇన్‌చార్జిగా ఆనాటి పాలకులపై పోరాడి, అందులో తనను కూడా భాగస్వామ్యం చేశారన్నారు. కావలిలో కరుణాకర్‌ను ఆత్మహత్య చేసుకునేలా వైసీపీ నేత వేధింపులకు గురిచేస్తే సుబ్బనాయుడి పోరాడి ఆ కుటుంబాన్ని ఆదుకోవడమేగాక తాకట్టులో ఉన్న ఆయన ఇంటిని తన సొంత నిధులు వెచ్చించి విడిపించారని గుర్తు చేశారు. చంద్రబాబు కావలి పర్యటనకు వచ్చినపుడు, యువగళం పాదయాత్రలో తన వెంట ఉన్నారని తెలిపారు. ఇలా మాలేపాటితో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. ఆయన బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరినప్పుడు అక్కడకు వెళ్లి డాక్టర్లతో మాట్లాడి మంచి వైద్యం అందించాలని చెప్పినా కాపాడుకోలేక పోయామని విచారం వ్యక్తం చేశారు. సుబ్బానాయుడు మృతితో టీడీపీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. చనిపోయి కష్టాలలో ఉన్నపుడు వారిని ఆదుకోవాల్సింది పోయి కొంతమంది ఆ కుటుంబంపై కించపరిచే పోస్టులు పెట్టి వేధించినట్లు, కుటుంబ సభ్యులు తన దృష్టికి తెచ్చారన్నారు. వాటిపై విచారించి వేధించిన వారిని, దాని వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. లోకేష్ వెంట టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, పాశిం సునీల్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బల్లి చక్రవర్తి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, నేతలు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయండి

● మంత్రి లోకేష్‌కు వినతి

ఉదయగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విస్తీర్ణంలో పెద్దదిగా ఉండి, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు ఎండీ ఖాజా, శ్రీరామచంద్ర మూర్తి, శ్రీను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి వర్గ ఉపసంఘంలో చేపడుతున్న డివిజన్ల పునర్విభజనలోనైనా ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని వారు కోరారు.

కందుకూరును 'ప్రకాశం'లో కలపాలి

కందుకూరు : కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని జేఏసీ నేతలు గురువారం మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. గుడ్లూరు మండలం మోచర్ల వద్ద జాతీయ రహదారిపై ఆగిన సందర్భంగా లోకేష్‌ను మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నేతృత్వంలో కలిసిన జేఏసీ నేతలు వినతిపత్రం అందజేశారు. పాదయాత్రలో మీరు ఇచ్చిన హామీ మేరకు ఇక్కడి ప్రజలందరి ఆకాంక్ష అయిన కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన, సీపీఐ పార్టీల నాయకులు బెజవాడ ప్రసాద్, కోటేశ్వరరావు, దామా మల్లేశ్వరరావు, గట్టమనేని హరిబాబు, చిలకపాటి మధుబాబు, గోకరాజు మదన్, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, గోచిపాతల మోషే, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖోఖో పోటీలకు మున్సిపల్ స్కూల్ విద్యార్థులు


రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విజయనగరంలో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 ఖోఖో పోటీలకు నెల్లూరులోని ఎంఎస్‌ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమం జరిగింది. తమ పాఠశాలకు చెందిన ఎస్ రిషిత, నందిని, లాస్య, మాధురి, ఈ సిద్ధు, చంద్రవరుణ్ రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఆ పోటీల్లోనూ ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ పీ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి విడుదల ఎప్పుడో...?

- నిండుకుండల్లా జలాశయాలు
- సముద్రంలోకి వృథాగా వరదనీరు
- ఇప్పటికే బీపీటీకి దాటిన అదును
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

సంగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల రాకతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలకు నిండుకుండల్లా మారాయి. అలాగే కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లు కూడా జలకళను సంతరించుకున్నాయి. కనుపూరు, పాపిరెడ్డి కాలువల కింద ఉన్న చెరువుల్లో కూడ పూర్తిసామర్థ్యంతో నీళ్లు చేరాయి. ప్రస్తుతం పెన్నాకి వచ్చే వరదనీరు వృథాగా సముద్రం పాలవుతున్నాయి.

● బీపీటీకి దాటిన అదును

వరద నీటిని కనుపూరు, పాపిరెడ్డి కాలువలకు విడుదల చేస్తే చెరువుల కింద సుమారు 2 లక్షల ఎకరాల్లో బీపీటీ సాగయ్యేది. అదీ జరగలేదు. జిల్లాలో అధికంగా నాటే బీపీటీ రకం విత్తనానికి నవంబరు ఐదుతేదీలోపు నారుమళ్లు పోసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. కాగా ఆరోతేదీ కూడా దాటపోవడంతో బీపీటీకి అదును దాటింది.

● 50 టీఎంసీలు కడలిపాలు

జిల్లాలో పెన్నా డెల్టా, కనుపూరు, బెజవాడ పాపిరెడ్డి కాలువల కింద సుమారు 4.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. వీటికి ఆధారమైన సోమశిల జలాశయం గత నెల మొదట్లోనే 70 టీఎంసీలకు చేరుకుంది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం 70 టీఎంసీలకు పరిమితం చేసి, మిగతానీటిని సముద్రానికి వి డుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే సుమారు 50 టీఎంసీలపైగా నీరు సముద్రంలోకి వదిలేశారు.

● రైతుల నిరాశ

జిల్లాలో కాలువల కింద బీపీటీ (5204) రకం సాగు చేసే రైతులు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారా.. నారుమళ్లు పోద్దామా...? అని నిన్న మొన్నటి వరకు ఎదురుచూశారు. తీరా అదును కూడా దాటిపోయింది. దీంతో ఇప్పటికే బీపీటీ రకం విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు నిరాశ చెందారు.


మోటార్ల కింద సాగుచేసిన నారుమళ్లు


వర్షాలకు బెజవాడ పాపిరెడ్డి కాలువలో చేరిన నీరు

● ఐఏబీ సమావేశం ఎప్పుడో...?

జిల్లా ఇరిగేషన్ అధికారులు కాలువలకు నీటి విడుదల చేసేందుకు ఐఏబీ (సాగునీటి సలహా బోర్డు) సమావేశం కావాల్సి ఉంది. మంత్రులు పాల్గొనే ఈ సమావేశానికి ఎప్పుడు ముహూర్తం నిర్ణయిస్తారో తెలియడం లేదు. కలెక్టర్ వెంటనే స్పందించి ఐఏబీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, నీటి విడుదల తేదీని ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

హౌసింగ్ కాంట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పక్కాగృహాల లబ్ధిదారులు

ఉదయగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరుచేసిన పక్కాగృహాలను నిర్మించకుండా నిధులు స్వాహాచేసిన కాంట్రాక్టర్లపై లబ్ధిదారులు గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. మండలంలోని గంగిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటుచేసిన లేఅవుట్‌లో 2023లో హౌసింగ్ శాఖాధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సమక్షంలో తీర్మానం చేసి గృహ నిర్మాణాలు చేసేందుకు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దేవండ్ల పిచ్చయ్యలకు ఒప్పందం మేరకు అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వారి ఖాతాలో వేసుకుని నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారు. అంతేకాక వాటిని పూర్తి చేయకుండా లబ్ధిదారులను మోసగించి తప్పించుకుని తిరుగుతున్నారు. కావున వారిపై చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ, ఏఈలు వీరాస్, షరీఫ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆది తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న పాల వ్యాను : డ్రైవర్ మృతి


పాల వ్యాన్‌లో ఇరుక్కుపోయిన మృతుడు మహేష్

ఉలవపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి పాలవ్యాను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం ఉలవపాడు జాతీయ రహదారి వీరేపల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాలు ప్రకారం.. మద్దిపాడు మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన మహేష్ (28) పాలవ్యాను డ్రైవర్‌గా వెళుతుంటాడు. పల్నాడు జిల్లా నగరికల్ నుంచి కావలికి పాలు తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యంలో వీరపల్లి హైవే వద్ద నిలిపి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో పాల వ్యాను నడుపుతున్న మహేష్ వాహనంలోనే ఇరుక్కుపోయి మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై అంకమ్మ తన సిబ్బంది, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఉలవపాడు సీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



శ్రీ దుర్గా భవాని జ్యోతిష్యాలయం
స్త్రీ, పురుషుల వశీకరణ, కుటుంబ, చదువు, పెళ్లి, ప్రేమ, భార్యా భర్తల మధ్య సమస్యలు, నాగదోషం ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పబడును. శ్రీ దుర్గ హోటల్ ఎదురుగా, స్టోన్‌హౌస్‌పేట, సెల్:97042 49338
AJR-240744

S.S.R. ఎంటర్‌ప్రైజెస్
మా వద్ద ఫర్మ్ సర్వీస్, ఫర్మ్ రిజిస్ట్రేషన్స్, ట్రేడ్ మార్క్, G.S.T, I.T రిటర్న్స్, లేబర్, వాటర్, ఫుడ్ లైసెన్స్‌లు మొదలుగునవి చేయించబడును. అవసరమైన వారు సం.ప్ర. సెల్: 94940 02654
AJR-240422

వివాహ పరిచయ వేదిక
హిందువు & క్రిస్టియన్ మాల కులస్థుల వారికి వివాహ పరిచయ వేదిక కలదు. ఎంట్రన్స్ సభ్యత్వ రుసుము రూ.1500/-. Time: ఉ. 9 to సా.6 గం. అడ్రస్ గూడూరు పాత బస్టాండ్ రిటైర్డ్ ఉద్యోగుల భవనం. సం.ప్ర. 94912 19494, 76720 59944
AJR-240374

గోడౌన్ అద్దెకు ఇవ్వబడును
నెల్లూరు మైపాడు రోడ్ హైవే సర్వీసు రోడ్డుకు దగ్గరలో 33 అంక; 40 అంక:ల ప్లాట్‌లలో గోడౌన్ కట్టి అద్దెకి ఇవ్వబడును. మరియు ప్లాట్లు అమ్మబడును. అంక: 2,25,000/- సం.ప్ర. 76758 15600
AJR-240540

బిజినెస్ ఆఫర్
నెల్లూరు జిల్లాలో తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము.అవకాశాన్ని కొల్పోకండి. Cont: RSJ Inspection Service Ltd., Cont: 8595924917, 8800629648.
AJA-246996

జ్యోతిర్లింగ్ శక్తి పీఠయాత్ర
వైద్యనాథ్, మాయాపూర్, తారకేశ్వర్, కామాక్య కలకత్తా, శృంకాలదేవి తేది:16-01-2026, 8 రోజులకి 16000/- (రైలు, బస్సు, భో+రూం) కె.వాసు, నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504
AJR-240421

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- మొగళ్లపాళెం ఇండోర్ స్టేడియం త్వరలో ప్రారంభం
- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పాండురంగారావు


మాట్లాడుతున్న డీఎస్‌డీవో పాండురంగారావు

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం పాండు రంగారావు తెలిపారు. నెల్లూరులోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో దశాబ్దానికిపైగా ఫుట్‌బాల్ కోచ్‌గా పని చేసిన తనకు జిల్లా క్రీడారంగంపై అవగాహన ఉందని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధ చేసుకున్నామన్నారు. మొగళ్ళపాళెం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆగిపోయిన పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే పూర్తిచేసిన ఇండోర్ స్టేడియంను త్వరలోనే వాడుకలోకి తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఎస్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : మాజీ సైనికులు, మాజీ కోస్ట్ గార్డ్ సిబ్బంది, వారి వితంతుల పిల్లలకు ఉన్నత వృత్తి విద్యకు ఆర్థిక సహాయం అందించటానికి ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కాలర్‌షిప్ పథకం(పీఎంఎస్ఎస్) సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా కోరారు. గురువారం జిల్లా సైనిక సంక్షేమాధికారి జి. హరికృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సైనికబోర్డు సభ్యులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకంలో నమోదు చేసుకోడానికి వారికి అవగాహన కల్పించాలన్నారు.

'చేనేతలకు తుఫాన్ సాయం అందలేదు'

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేతలకు అందాల్సిన ఆర్థిక సాయం అందలేదని చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. ఈవిషయమై గురువారం ఆయన నగరంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గం నారాయణరెడ్డిపేటలో దాదాపు 600 చేనేత కుటుంబాలు చేనేత వృత్తిపై, మరో 500 కుటుంబాలు ఉపవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. తుఫాన్ కారణంగా మగ్గాల్లో నీరు చేరడంతో వీరందరూ పని కోల్పోయారన్నారు. అయితే 600ల మందికిగాను 160 మందికి మాత్రమే ఆసహాయం అందిందన్నారు. దీనిపై విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, ఐకా నాగేశ్వరరావు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

తెల్లరాయిని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు

తహసీల్దార్ హెచ్చరిక

వలేటివారిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్విన తెల్లరాయిని తరలిస్తే పోలీసు కేసు నమోదు చేయిస్తానని తహసీల్దార్ నయీంఅహ్మద్ హెచ్చరించారు. మండలంలోని పోలినేనిచెరువులోని ప్రభుత్వ భూముల్లోని తెల్లరాయి అక్రమంగా తరలిపోతున్నదని, ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ స్పందించారు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. తెల్లరాయి తరలిస్తున్న రమణయ్యను తహసీల్దార్ పిలిపించి తెల్లరాయి తవ్వకాలకు అనుమతులు ఉన్నా యా, అనుమతులు ఉంటే పత్రాలు తీసుకురావాలని కోరారు. అనుమతుల పత్రాలు లేకపోవడంతో అక్రమంగా తవ్విన తెల్లరాయిని తరలించవద్దని, తమకు తెలియకుండా తరలిస్తే పోలీసుకేసు నమోదు చేయిస్తానని హెచ్చరించినట్లు తహసీల్దార్ తెలిపారు.తెల్లరాయి తరలించకుండా వీఆర్వో వీఆర్ఏ ద్వారా నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు.

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఐ. లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నగరంలోని టౌన్ హాల్లో జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఐ. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా పాయసం సుబ్రహ్మణ్యం, సహాధ్యక్షుడిగా డీ. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శిగా నళినీ మోహన్, కోశాధికారి గా డీ.మురళీమోహన్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎస్‌ఎం బాషా వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.

నేడు ఏఎస్ పేట మండల సర్వసభ్య సమావేశం

ఏఎస్ పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసన్నకుమారి గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించడంతో పాటు గ్రామాలలోని పలు సమస్యలపై చర్చిస్తారని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11566
వెండి కిలో ధర	రూ. 152100
వెండి ఒక గ్రాము	రూ. 158.10

న్యూస్ బాక్స్

రైతులకు యూరియా పంపిణీ



యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్, టీడీపీ నేతలు

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో పంట సాగు చేసే రైతులందరికీ యూరియా కొరత లేకుండా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పరిటాల సత్యం తెలిపారు. గురువారం సొసైటీ గోడౌన్‌లో నిల్వ ఉన్న యూరియాను రైతులకు ఆయన టీడీపీ నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన మేర నిల్వ ఉంచామన్నారు. టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పరిధిలోనే కాకుండా రైతు సేవా కేంద్రాల్లో సైతం యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు సందీప్, టీడీపీ పట్టణ కార్యదర్శి తోడేటి వెంకటయ్య, మున్సిపల్ కౌన్సిలర్ వేణు, ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ పొన్నం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీచేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి మదన్ మోహన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి 400 క్వింటాళ్ల జేజీ-11, 60 క్వింటాళ్ల కాక్-2 విత్తనాలు వచ్చాయన్నారు. క్వింటా శనగ విత్తనాలు పూర్తి ధర రూ.7,800 కాగా 25 శాతం సబ్సిడీ రూ.1,950 పోను రైతులకు రూ. 5,850కు అందజేయడం జరుగుతుందన్నారు. కావున అవసరమైన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రబీకి అనుకూల రకాలు సాగు చేసుకోవాలి : ఏవో

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సాగులో అనుకూల రకాల వరి పంట చేసుకోవాలని ఏవో శైలజాకుమారి సూచించారు. మండలంలోని పడమటికంభంపాడు, సోమశిల గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తనశుద్ధి చేసి నారుమళ్లు చల్లుకోవాలన్నారు. కార్యక్రమం లో ఏఈవో కృష్ణవేణి, వీఏఏలు జ్యోత్స్న, వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉదయగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని ఎన్‌బీ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసి బోధన చేయాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చల్లా రఘురామిరెడ్డి

కలువాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు ప్రభుత్వం అందజేసింది. గురువారం బాలికల హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి చేతులు మీదుగా వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు ఎఎస్‌డబ్ల్యూ ఓ సుధామణి, వసతిగృహ సంక్షేమాధికారి వెంకటరమణమ్మ, నీటి సంఘం అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైవేపై మూగజీవాల మృత్యుఘోష

- నష్టపోతున్న పాడి రైతులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో విస్తరించి ఉన్న 167-బీజీ, 565, 167-బీ జాతీయ రహదారుల వెంట మూగజీవాల మృత్యుఘోష కొనసాగుతోంది. నిత్యం ఎక్కడో ఓ చోట గేదెలు ఢీకొని వాహనాలు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈఘటనల్లో కొందరు మృతిచెందగా, మరికొందరు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలవుతున్నారు. రాత్రి సమయాల్లో రహదారులపై గేదెల సంచారం ప్రమాదాలకు కారణమవుతోంది. వాహనాలు ఢీకొని గేదెలు మృతిచెంది పాడి రైతులు, వాహనాలు దెబ్బతిని వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.



ప్రమాదంలో మృతిచెందిన గేదె



గేదెను ఢీకొని దెబ్బతిన్న కొత్త కారు

గేదెల మృతితో నష్టపోతున్నరైతులు

ఆయా జాతీయ రహదారుల్లో వాహన ప్రమాదాల్లో వందల సంఖ్యలో గేదెలు మృతి చెందుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రధానంగా 167-బీజీ జాతీయ రహదారిపై కుర్రపల్లి సెంటర్‌లో ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొని పది గేదెలు మృతిచెందాయి. సోమలరేగడ, సర్వరాబాదు, దాసరిపల్లి, ఉదయగిరిల వద్ద వాహనాలు ఢీకొని పదుల సంఖ్యలో గేదెలు మృత్యువాతపడ్డాయి. కాగా, గేదెల కళేబరాలను రోడ్డుపక్కనే పడేస్తుండడంతో దుర్వాసనతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పలువురి మృత్యువాత

వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో విస్తరించిన 565 జాతీయ వెంట తరచూ ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాతపడుతున్నారు. సర్వరాబాదు గ్రామం వద్ద గేదెను ఢీకొని మాసాయిపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. మితిమీరిన వేగంతో వస్తూ రోడ్డు క్రాస్‌చేస్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో ఎలాంటి ప్రమాదం సంభవించకపోయినా కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ సంస్థ, అధికారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పశువులను రహదారులపై వెళ్లకుండా పాడి రైతులు సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా జ్వాలా తోరణం



జ్వాలా తోరణం నిర్వహిస్తున్న భక్తులు

సంగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకు బుధవారం అర్ధరాత్రి జ్వాలా తోరణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కామాక్షిదేవి, సంగమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను చప్పర వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద వరిగడ్డితో జ్వాలా తోరణం ఏర్పాటు చేశారు. జ్వాలా తోరణం కింద స్వామి, అమ్మవారి చప్పర ఉత్సవం అనంతరం గ్రామంలో ఊరేగించారు. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

చేనేత, మత్స్యకార కుటుంబాలకు తుఫాన్ సాయం



చేనేత కార్మికుడికి తుఫాన్ సాయం అందిస్తున్న రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు.

కలువాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేనేత, మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం తుపాను సాయం అందించినట్లు తహసీల్దారు డీ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు ఇబ్బందులకు గురైన కలువాయి, రామన్నగారిపల్లె, పెన్నబద్వేలి, తదితర గ్రామాలకు చెందిన మత్స్యకార, చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యం, కేజీ పామాయిల్, కందిపప్పు, చక్కెర, ఉర్లగడ్డలు, ఉల్లిపాయలు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే తెలుగురాయపురంలో చేనేత కార్మికుడు శ్రీనివాసులకు తుపాను సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంనారాయణరెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, బత్తలపల్లి నారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

వింజమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని బొమ్మరాజుచెరువు గ్రామంలో బుధవారం ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ సీహెచ్‌వి సుబ్బారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ బి హరీష్, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, సీఈవో మేకల రమణయ్యయాదవ్, డైరెక్టర్ గని శ్రీనివాసనాయుడు కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక డిపాజిట్ పథకాలను, తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం శ్రీనివాసులురెడ్డి, కళాజాత కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

కాకర్ల సునీల్ జన్మదిన వేడుకలు



ఉదయగిరి: విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు కాకర్ల సునీల్ జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. అలాగే అనాధశ్రమంలో చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, ఉప్పుటూరి పెదవెంకటయ్య, అనంతశెట్టి ఏడుకొండలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాకర్ల సునీల్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. అలాగే ఉదయగిరి పట్టణంలో ప్రమాదానికి గురై అనారోగ్యంతో బాధపడుతున్న వేమవరపు ఆదిత్యకు మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మట్ల లక్ష్మయ్య, రామయ్య, శ్రీరాములు, నారాయణరెడ్డి, హరీష్, వెంకటేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండలకేంద్రంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ సోమనబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో కాకర్ల సునీల్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి జాషువా, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు, ఇజ్రాయిల్, మండల యువత అధ్యక్షుడు వికాష్‌బాబు, సింగాల నాగేశ్వరరావు, దేవర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యం కావాలి : ఎంపీపీ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు నిబద్ధతో పనిచేయాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్, వెలుగు కార్యాలయాల సమావేశ మందిరాల్లో గురువారం ఆత్మకూరు డివిజన్ స్థాయిలో 9 మండలాల పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన రెండురోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి పేదరికం లేని ఆరోగ్య పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ట్రైనర్లు జిల్లా శిక్షణ వనరుల కేంద్రం నుంచి మహ్మద్ జిలాని బేగ్, మహిమలూరు, అనంతసాగరం గ్రామ పంచాయతీ కార్యదర్శులు విజయ్, నరసింహులు శిక్షణా కార్యక్రమాన్ని కొన సాగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి రఫీఖాన్, డివిజనల్ పంచాయతీ అధికారి రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో భువనేశ్వరీ, అనంతసాగరం, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, సీతారామపురం, ఉదయగిరి, కలువాయి, చేజర్ల, సంగం మండలాలకు చెందిన పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సురేఖదేవి

ఉదయగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ యాజమాన్య పద్ధతులు పాటించి పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్త సురేఖదేవి సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు వ్యవసాయ సహాయ సంచాలకులు పార్లపల్లి చెన్నారెడ్డి ఆధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేపట్టాలని, మట్టి పరీక్షలు చేపట్టిన అనంతరం వచ్చే ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. లోతు దుక్కులు చేయడం ద్వారా పంటలను తెగుళ్ల, పురుగుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ప్రభుత్వ రాయితీ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రామ్మోహన్, ఉద్యాన శాఖాధికారి జయశ్రీ, ఏవోలు మదన్ మోహన్, సునీల్, విజయభాస్కర్, కవిత, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూవో రమణారెడ్డి

ఉదయగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా ఉదయగిరి ఏస్‌డబ్ల్యూవో పరిధిలోని సంక్షేమ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో రమణారెడ్డి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో వార్డెన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వేడి నీరు, వేడి ఆహార పదార్థాలు ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ట్రస్టు ప్రతినిధులు

ఉదయగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జీఎంకే ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి వితరణ చేసిన నోట్‌పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు సరిపోకపోవడంతో జీఎంకే ట్రస్టు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వర్లు, కాశయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులే ఉండాలి : బీజేపీ



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేస్తున్నబీజేపీ నేతలు

వింజమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులే ఉండేలా ప్రజలను చైతన్యపర్చాలని స్థానిక బీజేపీ నేతలు పేర్కొన్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు అంబటి ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మండల ఇన్‌చార్జ్ మారెళ్ల బ్రహ్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సెక్రటరీ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులే ఉండాలని, మన వస్తువులను మనమే అమ్ముకోవాలని ప్రధాని నరేంద్రమోడీ పిలుపునిచ్చారన్నారు. అనంతరం పట్టణంలోని పలు ఇళ్లకు వెళ్లి వారికి స్వదేశీ వస్తువుల ఉపయోగం గురించి వాటి ద్వారా వచ్చే ప్రయోజనాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మద్దూరి నాగేశ్వరరావు, మండల, గ్రామ స్థాయి బీజేపీ కార్యకర్తలు, నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ అజిత వేజెండ్ల



పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

కోవూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి పెట్టినట్లు ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీసుస్టేషన్‌లో సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. సర్కిల్ కార్యాలయ పరిధిలో పరిస్థితులను సీఐ సుధాకర రెడ్డి ఎస్పీకి వివరించారు.

కనిగిరి కాలువలో మృతదేహం

- మృతుడు నెల్లూరు నగర వాసిగా గుర్తింపు



మృతుడు మనోజ్ (ఫైల్)

సంగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపు వద్ద కనిగిరి ప్రధాన కాలువ నీటిలో ఓ వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వ్యక్తి మృతదేహాన్ని, స్కూటీని నీటిలో నుంచి గట్టుకు చేర్చారు. స్కూటీ నెంబరు ఆధారంగా నెల్లూరు వాసి మనోజ్ (57)గా పోలీసు లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసు ల సమాచారం మేరకు.. మృతుడు నెల్లూరులోని వేదాయపాళెంలో నివాసం ఉంటున్నాడు. భార్య పేరు మాధవి. వీరికి పిల్లలు లేరు. చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఓ పని పరిశీలన నిమిత్తం వెళ్తున్నట్లు భార్య మాధవికి చెప్పి స్కూటీపై బయలుదేరాడు. ఇతనితోపాటు వీరి డ్రైవ ర్ మనోజ్ కుమార్ కూడా వచ్చాడు. అయితే మండలంలోని రాంపు వద్దకు వచ్చిన తరువాత నేను ఒక్కడినే వెళ్లి వస్తాను... నువ్వు వెళ్లిపోమని డ్రైవర్‌ను బస్సు ఎక్కించాడు. అప్పటి నుంచి మనోజ్ ఆచూకీ కనిపించలేదు. అయితే గురువారం ఉదయం స్కూటీతో పాటు మనోజ్ మృతదేహం కాలువ నీటిలో లభ్యమయింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని, స్కూటీని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి మద్యం అలవాటు లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పోలీసులు ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. ఆత్మహత్యా లేక హత్యా అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసుగా నమో దు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

రైలు పట్టాలపై..

కావలి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దూరుపాడు సమీపంలో ఎగువభాగాన రైలు పట్టాలపై గురువారం తమిళనాడుకు చెందిన శంకర్ (29) మృత దేహాన్ని కీ మెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు తెలిపాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకట్రావ్ మృతదేహాన్ని పరిశీలించి మృతుని వద్ద లభించిన ఆధారాల మేరకు తమిళనాడువాసిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం సాయంత్రం తాడేపల్లి నుండి చెన్నై సెంట్రల్‌కు రైల్లో వెళ్తూ జారిపడి మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ములుముడి గ్రామంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు నెల్లూరు రూరల్ సీఐ వేణు తెలిపారు. నగరంలోని బీవీనగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌ను ఇటీవల ములుముడి గ్రామంలో చాకుతో పొడిచి రక్తగాయాలు చేసిన ఘటనలో నిందితుడు కుండా ప్రేమ్‌కుమార్ అని సీఐ తెలిపారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

6 సవర్ల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం బంగ్లాతోటలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు బంగ్లాతోటలో రఫీ కుటుంబం నివసిస్తోంది. ఆయనపై అంతస్తులో ఉంటుండగా కుటుంబ సభ్యులు కింద పోర్షన్‌లో ఉంటున్నారు. బుధవారం మనుమరాలికి అనారోగ్యంగా ఉండటంతో ఆయన ఆసుపత్రికి తీసుకెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చి కింద పోర్షన్‌లో నిద్రపోయారు. ఈ క్రమంలో గురుతెలియని దుండగులుపై అంతస్తు గది తాళాలు తెరిచి ఆరు సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గురువారం బాధితుడు నవాబు పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

సీతారామపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎల్వీఆర్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణప్ప పేట గ్రామానికి చెందిన తలారి విజయ్ సాగర్ అనే బాలుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణప్పపేట నుంచి పాల ఆటో సీతారామపురానికి వస్తూ మార్గమధ్యంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న కూరగాయల ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో పాల ఆటోలో ప్రయాణిస్తున్న విజయసాగర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ఎక్కడ ?

చిన్నపాటి బోర్డు కూడా కనిపించని వైనం



నివాసం వద్ద కనిపించని వైద్యశాల బోర్డు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువు విలేజ్ హెల్త్ క్లినిక్ జాడ తెలుసుకునేందుకు ప్రజలు, రోగులకు తిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నూతన భవనం మంజూరైనప్పటికీ పనులు చేపట్టక పోవడంతో పునాదుల దశలోనే వెక్కిరిస్తోంది. దీంతో గ్రామంలోని ఓ నివాసాన్ని అద్దెకు తీసుకొని కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడ కనీసం చిన్నపాటి బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇతర గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చిన రోగులు ఆ కేంద్రానికి వెళ్లేందుకు దారి పొడవునా ఆరా తీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్ సమాచారం ప్రజలకు తెలిసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 585

మినీ తిరుమలగా బిట్రగుంట !

కావలి, (బిట్రగుంట) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) బోగోలు మండలం కొండబిట్రగుంట లోని బిలకూటక్షేత్రాన్ని మినీ తిరుమలగా అభివృద్ధి చేస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం అధికారులు, పార్టీ నాయకులతో కలిసి బిలకూటక్షేత్రంలో జరుగుతున్న మహా ప్రాకారం, కోనేరు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆలయ అభివృద్ధి ప్రణాళిక గురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిలకూటక్షేత్రం అభివృద్ధి పనులను ప్రభుత్వం, దాతల సహకారంతో చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ఈసారైనా మున్సిపల్ ఎన్నికలు జరిగేనా!?

- కావలి మున్సిపల్ ఎన్నికలపై కూటమి నేతల ఆశలు
- కోర్టు స్టేతో గతంలో ఆగిన ఎన్నికలు
- చౌదరిపాలెం, మున్సిపాలిటీ మధ్య కుదిరిన సయోధ్య

కావలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన కావలి మున్సిపల్ ఎన్నికలు ఈ సారైనా జరుగుతాయా? అని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కావలికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న చౌదరిపాలెం గ్రామాన్ని గ్రామస్థుల అభిప్రాయానికి భిన్నంగా కావలి పురపాలక సంఘంలో కలిపారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. అప్పట్లో హైకోర్టు స్టే ఇవ్వటంతో మున్సిపల్ ఎన్నికలు ఆగిపోయాయి. ఎన్నికలు జరగకపోవటంతో పురపాలక సంఘంలో అవినీతి వ్యవహారాలు వైసీపీకి బాగా కలిసొచ్చాయి. రెండో కంటికి తెలియకుండా దొరికిన కాడికి వైసీపీ నేతలు దోచుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి మంచి పట్టున్న చౌదరిపాలెం గ్రామాన్ని వారి అభిప్రాయాలకు అనుకూలంగా కావలి మున్సిపాల్టీ నుంచి తొలగించేందుకు సిద్దమయ్యారు, అందులో భాగంగా చౌదరిపాలంను మున్సిపాల్టీలో నుంచి తొలగించాలని అధిస్టానం దృష్టికి, కోర్టు దృష్టికి మున్సిపల్ అధికారులు లిఖిత పూర్వకంగా తీసుకెళ్లారు. దీంతో చౌదరిపాలెం వాసులు కూడా కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకున్నారు.

ఎన్నికలకు తొలగిన అడ్డంకులు

చౌదరిపాలెం, మున్సిపాలిటీ మధ్య సయోధ్య కుదరటంతో కావలి మున్సిపల్ ఎన్నికలకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. కానీ ప్రభుత్వం నుంచి చౌదరిపాలెంను కావలి మున్సిపాలిటీ నుంచి తొలగిస్తున్నట్లు అధికారికంగా ఉత్తర్వులు ఇంతవరకూ రాలేదు. అయితే గత 10 నెలలుగా కావలి మున్సిపల్ ఎన్నికలు అవిగో.. ఇవిగో.. అంటూ ఊరిస్తూ వచ్చాయి. అయితే త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే మున్సిపల్ ఎన్నికలతో కలిసి కావలి ఎన్నికలు కూడా జరుగుతాయన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కావలి మున్సిపాలిటీ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండటంతో కూటమి నాయకులు మున్సిపల్ ఎన్నికలపై గంపెడు ఆశలతో ఉన్నారు. కౌన్సిలర్ పదవులపై ఆశలు పెట్టుకున్నవారంతా ఎన్నికలు వస్తే తాము ఇక గెలిచినట్లేనని ఉవ్వీళ్లూరుతున్నారు. అయితే కావలి మున్సిపల్ ఎన్నికల సమస్య క్లియర్ అయినప్పటికీ.. రాష్ట్రంలో ఇలాంటి మున్సిపాల్టీలు 17 ఉండటంతో అన్నింటినీ క్లియర్ చేసి వాటన్నిటికీ కలిపి ఒకేసారి ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 10 మున్సిపాలిటీలలో కూటమి నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నా మరో 7 మున్సిపాలిటీలలో నేతలు సుముఖంగా లేరని తెలుస్తోంది. అయితే ఎన్నికలు జరగని మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికసంఘం నిధులను నిలిపివేస్తుండటంతో, ఎన్నికలు జరగని మున్సిపాలిటీలు ఆర్థికంగా నష్టపోవటమే కాక అభివృద్ధి కుంటుపడుతోంది. దీంతో ప్రభుత్వం ఎన్నికలు జరుపకపోతే మున్సిపాలిటీలు ఆర్థికంగా, అభివృద్ధిపరంగా వెనుకబడుతున్నాయని రాష్ట్రంలోని 17 మున్సిపాలిటీలలోని కూటమి నేతలను ఒప్పించి ఎన్నికలు జరపాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.



కావలి మున్సిపల్ కార్యాలయం

● ఎన్నికలు జరిగితే ఎవరికి లాభం?

కావలి మున్సిపల్ ఎన్నికలు జరిపితే ఎవరికి లాభం? అనే అంశంపై ప్రస్తుతం పట్టణంలో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు కావలి మున్సిపాలిటీలో టీడీపీకి పూర్తి మెజారిటీ వచ్చిన దాఖలాలు లేవు. ఈసారి పూర్తి మెజారిటీతో మున్సిపల్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకునే అవకాశాలు ఉండటంతో కూటమి నేతలకు ఎన్నికలు లాభం చేకూరుతుందన్న అభిప్రాయం చాలామందిలో ఉంది. అయితే ఎన్నికలు జరగకపోతే మున్సిపాలిటీలో అన్నీ ఎమ్మెల్యే కనుసన్నలలో జరిగిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అదే ఎన్నికలు జరిగి పాలకవర్గం ఏర్పడితే, ఏ నిర్ణయాన్నికైనా మున్సిపల్ పాలకవర్గం అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఏకపక్ష నిర్ణయాలకు తావు లేకుండా పోతుంది. ఈ పరిస్థితులలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయా? లేక వాయిదా పడతాయా? అనే సందేహం నెలకొంది.

మురుగు కాలువల్లో మేమే పూడిక తీసుకోవాలా?

● పంచాయతీ సిబ్బందిపై ప్రజల ఆగ్రహం

అల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'మా ఇళ్ల ముందు మురుగు కాలవల్లో పూడికను మేమే తీసుకోవాలా..?' అంటూ పంచాయతీ సిబ్బందిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాల్లోని చెత్తాచెదారం, మురుగు కాలవల్లో పూడికను తొలగించడంలో అధికారులు, పారిశుధ్య సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బలిజపాలెం వీధిలో నెలల తరబడి మురుగు కాలవలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, పలుమార్లు పారిశుధ్య సిబ్బందికి చెప్పినా స్పందించడం లేదన్నారు. చివరికి దోమల బెడద తాళలేక మురుగు కాలవలో తామే పూడిక తీసుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు.

యూరియా పంపిణీ


యూరియా అందజేస్తున్న జాగర్లమూడి శ్రీనివాసులు, తదితరులు

కొండాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట సచివాలయంలో గురువారం రాయితీపై రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతుసేవాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సాగునీటి సంఘం చైర్మన్, టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం బస్తా యూరియా రూ. 280కే రైతులకు అందజేస్తోందన్నారు. సచివాలయ పరిధిలో 400 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లక్ష్మీప్రసన్న, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు చేయూత


నిరుపేదలకు టార్పాలిన్ పట్టలు, రగ్గులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నివాసాలు దెబ్బతిన్న పలు కుటుంబాలకు కందుకూరు రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనిచ్చింది. గురువారం పట్టణంలోని విప్పగుంట రోడ్డులో ఏయంసీ పక్కన గుడారాల్లో నివసిస్తున్న పేదలకు వంట సామగ్రి, టార్పాలిన్ పట్టలు, దోమతెరలు, రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కే. అనూష సేవలు అందిస్తున్న చెన్నా రామాంజనేయులును అభినందించారు. ఈ సందర్భంగా డాక్టరు తన్నీరు మలికార్జునరావు చేతుల మీదుగా ఇద్దరికి వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైష్ణవి, చక్కా కేశవ, రవ్వా శ్రీనివాసులు, చిలకపాటి మధు, మాధవ, ఆశావర్కర్ కరీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు

కావలి (టౌన్) నవంబరు 6(ఆంధ్రజ్యోతి):డీఆర్ విశ్వోదయా బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీల్లో భాగంగా గురువారం జరిగిన నృత్య పోటీల్లో చిన్నారులు శాస్త్రీయ జానపద నృత్యాలు అలరించాయి. జేబీ డిగ్రీ కళాశాల ఎంఎం హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ పాఠశాలలనుంచి పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు అభినయం హావభావాలతో ప్రదర్శించిన తీరు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఆర్గనైజర్ జ్యోతిశ్రీ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా సూరిశెట్టి రామచంద్రయ్య, గుత్తి ఉషశ్రీ, నల్లూరు రామకృష్ణ వ్యవహరించారు. విశ్వోదయా చైర్మన్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.


నృత్య పోటీల్లో పాల్గొన్న చిన్నారులను అభినందిస్తున్న దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి తదితరులు

నిర్లక్ష్యంగా ఉంటే ఊస్టింగే...!

● డ్రైవర్లకు నగర కమిషనర్ హెచ్చరిక

నెల్లూరు(సిటీ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా డ్రైవర్లుగా పనిచేస్తున్న వారు బాధ్యతగా నడుచుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని కమిషనర్ నందన్ హెచ్చరించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ చెత్త వాహనాలు నడిపే డ్రైవర్లతోపాటు అధికారుల వద్దనున్న డ్రైవర్ల హాజరు సక్రమంగా ఉండాలన్నారు. దీర్ఘకాలం సెలవులో ఉండటం, విధుల్లో నిర్లక్ష్యాన్ని గుర్తిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం బ్యాంకు అధికారులతో సమీక్ష జరిపారు. టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. కాగానగరంలోని 9వ డివిజన్ 3వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పని చేస్తున్న బీ తిరుపాలుకు కమిషనర్ షోకాజు నోటీసు జారీ చేశారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు పెంచల నరసయ్య మాట్లాడుతూ సమ్మె కాలం నాటి జీతం వెంటనే చెల్లించాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలతో కూడిన ఉద్యోగ విరమణ అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సుజాతమ్మ, దేశమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం


ముసునూరు టోల్‌గేట్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేశ్, పక్కన కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దగదర్తి పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌కు పట్టణంలోని జాతీయరహదారిపై ముసునూరు టోల్ ప్లాజా వద్ద గురువారం ఉదయం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కావలి ఎమెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అధిక సంఖ్యలో కార్యకర్తలు స్వాగతం పలికారు. లోకేశ్ కారు ఆపి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని దగ్గరకు పిలిచారు. దీంతో లోకేశ్ కారు వెనుక సీటులో ఎమ్మెల్యే వెళ్లి నిలబడ్డారు. మంత్రి లోకేశ్ ప్రజలకు అభివాదం చేస్తుండగా, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. క్రేన్ సాయంతో లోకేశ్‌కు భారీ గజమాల వేసేందుకు ప్రయత్నించగా, పరామర్శకు వెళ్లుతూ పూలమాల వేసుకోకూడదని లోకేశ్ సున్నితంగా తిరస్కరించారు. లోకేశ్ ప్రజలకు అభివాదం చేస్తున్న సమయంలో 'జై కావ్య.. జైజైకావ్య.. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి జిందాబాద్' అంటూ కొందరు నినాదాలు చేయగా, ఎమ్మెల్యే వద్దని వారించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే దగదర్తికి వెళ్లే విషయం లోకేశ్‌తో చర్చించారు. లోకేశ్ వద్దని చెప్పటంతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి టోల్‌గేట్ వద్ద కారు దిగి వెళ్లిపోయారు. కావలి నియోజకవర్గంలో జరిగిన మంత్రి లోకేశ్ పర్యటనలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తప్ప, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ పాల్గొనటం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

● **గుడ్లూరు** : రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు కావలి నియోజకవర్గం దగదర్తి మండలానికి వెళుతున్న రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌ను, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.ఎండి ఫరూక్‌లకు గుడ్లూరు మండలం మోచర్ల దగ్గర టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. తొలుత కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మోచర్ల దగ్గరకు చేరుకొని, నారా లోకేష్‌కు ఘన స్వాగతం స్వాగతం పలికారు. ప్రజలు, కార్యకర్తలను లోకేష్ ఆప్యాయంగా పలకరించి వారి నుంచి అర్జీలు తీసుకున్నారు.


లోకేష్‌కు నేతలను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

క్షతగాత్రులను అన్నివిధాలా ఆదుకుంటాం

● ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్రోల్ బంకు వద్ద గురువారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన మహిళలకు తాను అన్నివిధాలా అండగా ఉంటానని, మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చు భరిస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించి జరిగిన ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రమాద విషయం తెలిసి మంత్రి నారా లోకేష్ స్పందించారని, బాధితులు త్వరగా కోలుకోవాలని, వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు.

అధ్యాపకురాలు అవంతికి డాక్టరేట్



కావలి (టౌన్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీ ఎస్‌యు పీజీ కళాశాల అధ్యాపకురాలు ఆలా అవంతికి చెన్నై అన్నామలై యూనివర్శిటీ గురువారం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'డిజైన్ ఫర్ ఐవోటీ అండ్ ఫ్యూచర్ వైర్‌లెస్ కమ్యూనికేషన్' అనే అంశంపై ఆమె తన సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించగా, అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా పరిశోధన విషయంలో తనను ప్రోత్సహించిన పీజీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు అవంతి కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీ స్టేడియంలో కోడిగుడ్ల పంపిణీ

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీ రావు 90వ జయంతి సందర్భంగా ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం ఉచితంగా కోడిగుడ్లు పంపిణీ చేశారు. కోడిగుడ్డులోని పోషక విలువలు తెలియచేస్తూ వాకర్స్‌కు, క్రీడాకారులు కరపత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47,48వ డివిజన్లలో దోమల నివారణకు గురువారం ధర్మవరం టీం ఆధ్వర్యంలో కాలువల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. కుక్కలగుంట, రాజేంద్రనగర్, ఉయ్యాలకాలువ, మహాలక్ష్మమ్మ గుడి, మసీదు సెంటర్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, విజయలక్ష్మి, పూజారి సారిక, రాజేశ్వరి, రత్నమ్మ, కల్వకుంట్ల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వంద ఎలక్ట్రికల్ బస్సులు

- నెల్లూరు-2 డిపోకి కేటాయింపు
- గ్యారేజ్‌లో 25 చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు
- ఇతర డిపోల్లోనూ చార్జింగ్ పాయింట్లు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-బస్ సేవ కింద మొదటి దశలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు చేసింది. వీటిలో నెల్లూరు జిల్లా ఆర్టీసీ రెండవ డిపోకు 100 బస్సులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. మొదటి విడత టెండర్లలో పూణెకు చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ బస్సుల కాంట్రాక్టు దక్కించుకుంది. వచ్చే ఏడాది మొదటి మూడు నెలల్లోనే జిల్లాకు 100 ఎలక్ట్రికల్ బస్సులు పూర్తిస్థాయిలో చేరుకోనున్నాయి. ఎలక్ట్రికల్ ఏసీ, నాన్ ఏసీ బస్సులు జిల్లాకు చేరుకుంటే నెల్లూరు నుంచి చెన్నై, విజయవాడ, తిరుపతి ఇతర ప్రాంతాలకు బస్సులను నడపనున్నారు.

● రూ.1.5 కోట్లతో చార్జింగ్ స్టేషన్

నెల్లూరు 2వ డిపో ఆధ్వర్యంలో తిరుపతి డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను నెల్లూరు-తిరుపతి మధ్య నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నారు. ఈ బస్సుల కోసం 2వ డిపోలోని గ్యారేజ్‌లో చార్జింగ్ స్టేషన్‌ను నిర్మించి చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక జిల్లాకు రానున్న 100 ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజ్‌లోనే 25 చార్జింగ్ పాయింట్లతో భారీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటుకు జిల్లా ఆర్టీసీ అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చార్జింగ్ స్టేషన్‌లో మరికొన్ని చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం గ్యారేజ్‌లో బస్సులను శుభ్రపరిచే వాటర్ వాషింగ్ పాయింట్‌లోనూ భారీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. 25 చార్జింగ్ పాయింట్లతో ఏర్పాటు చేసే ఈ స్టేషన్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఇక కావలి, కందుకూరు డిపోల్లోనూ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటుకు అధికారులు సన్నద్దమవుతున్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి కోసం కరపత్రాల విడుదల

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చింతారెడ్డిపాళెం కూడలిలో జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని ఆ వంతెన సాధన పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆదిత్య నగర్ పిల్లల పార్కు వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, విశ్రాంత ఏఎస్పీ రాంబాబు పాల్గొన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ఆ ప్రాంతంలో అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

అన్నదాతలను ఆదుకునేవారేరీ..?

● చెరువులు నిండినా వరిసాగుకు సిద్ధం కాని రైతులు ● పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు ● మాగాణి భూముల్లో జామాయిలు సాగు

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వాలు, పాలకులు చెబుతున్న మాటలు ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. అన్నదాతలకు కంటితుడుపుగా సాయం చేసి అన్నీ తామే చేసినట్లుగా ప్రభుత్వాలు ప్రకటించుకోవడం తప్ప ఆపదలో ఉన్న రైతులను ఆదుకునేందుకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించిన దాఖలాలు లేవని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మాగాణి భూముల్లో సాగు చేసిన జామాయిలు

దాదాపు 5 వేల ఎకరాల్లో వరిసాగు

మండలంలోని 19 పంచాయతీల పరిధిలో ఉన్న చెరువులకింద దాదాపు 5 వేల ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నారు. బోర్లు, వాగులతో పాటు రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టుకింద వరి సాగు చేస్తున్నారు. ఈసారి రబీలో ముందుగానే వర్షాలు విస్తారంగా కురవడంతో చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండాయి. ఇక నారుమడులు సిద్ధం చేసుకునేందుకు రైతులు ఉపక్రమిస్తున్నారు.

పెట్టుబడుల వ్యయం రెట్టింపు

ఎకరం వరిసాగుకు 10 సంవత్సరాల క్రితం వరకు రూ. 20 నుండి రూ. 25 వేలు ఖర్చయ్యేది. ఎకరానికి 40 నుండి 50 బస్తాల దిగుబడి వచ్చేది. 75 కేజీల బస్తా అప్పట్లోనే రూ. 1000 నుండి రూ 1300 వరకు ధర ఉండేది. నేడు ఎకరం వరి సాగు చేయాలంటే రూ. 40 నుండి 45 వేల వరకు ఖర్చవుతోంది. దిగుబడి గతంలో ఉన్నవిధంగానే 40 నుండి 50 బస్తాలు వస్తున్నప్పటికీ ధర మాత్రం పెరగలేదు. కౌలు భూములైతే పెట్టుబడి మరింత పెరుగుతోంది.

ప్రభుత్వ షరతులతో అన్నదాత కుదేలు

ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ. 2400 పైగా ప్రకటించినప్పటికీ రైతులు అమ్ముకోవాలంటే పలు షరతులు విధించింది. వరినాటే సమయంలో ఈక్రాప్‌చేసి నూర్పిడి చేయాలి. తర్వాత ధాన్యాన్ని తేమ 17 శాతం వచ్చే విధంగా ఆరబోసి, ధాన్యం విరగకుండా ఉంచుకోవాలి. వ్యవసాయశాఖ అధికారులు చెక్ చేశాక తూకం వేసి, లారీలలో ధాన్యాన్ని ఎంపిక చేసిన మిల్లర్లకు పంపిస్తారు. అయితే అక్కడ ధాన్యం దించుకోకుండా మిల్లర్లు కొర్రీలు వేసి రైతులను ఇబ్బందిపెడుతున్నారు. ఈవ్యవహారంతో విసిగివేసారిన రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని బయట మార్కెట్లో దళారులకు తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది.

మాగాణి భూముల్లో జామాయిలు సాగు

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే సాగులో జామాయిలు ఒకటి. ఎకరం జామాయిలు నేడు రూ. 1 లక్ష నుండి రూ. 1.50 వేల వరకు అమ్ముతున్నాయి. సాగుచేసిన మూడు సంవత్సరాలలో తక్కువ పెట్టుబడితో ఆదాయం వస్తుంది. ఆరుగాలం కష్టపడి వరి సాగు చేసినా నష్టాలు వస్తుండటంతో, రైతులు మాగాణి భూములలో జామాయిలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వాలు ధాన్యానికి మద్దతు ధర పెంచి అన్నదాతలను ఆదుకోకపోతే వరిసాగు వదిలేసి రైతులు జామాయిలు సాగు వైపు మొగ్గు చూపే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అన్నదాతలను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇంటి ముందు మురుగు నీరు...

చెరువు కట్టపై కర్మకాండ భోజనాలు

● వృద్ధురాలికి కర్మకాండ చేసుకోలేక అవస్థలు

కావలి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొత్తపల్లిలో అనారోగ్యం తో ఇటీవల మృతి చెందిన వృద్ధురాలు చిమ్మిలి సుబ్బరత్నమ్మ కర్మకాండకు వచ్చిన బంధువులు కనీసం కార్యక్రమం నిర్వహించేందుకు కూడా ఇంటివద్ద వీలుకాక గురువారం తీవ్ర అవస్థలు పడ్డారు. మొంథా తుఫాను ప్రభావం నుండి బయట పడ్డ గ్రామస్తులు కొత్తూరు బీసీ కాలనీలో రోడ్లు, మురుగు నీటి కాలువలు సరిలేవని వాపోతున్నారు. ఇళ్లముందు మురుగు నీటి నిల్వతో దుర్గంధం, దోమల బెడదతో ఇళ్ల నుండి బయటకు రాలేక ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటివద్ద మురుగు నీరు, బురద పేరుకుపోవడంతో కర్మక్రియలకు వచ్చిన బంధువులకు ఇంటి ముందు కనీసం భోజన ఏర్పాట్లు చేసేందుకు కూడా వీలు కాలేదు. అపరిశుభ్రత వల్ల అక్కడ అడుగు పెట్టేందుకు వీలు కాకపోవడంతో విధిలేనిపరిస్థితుల్లో సమీపం లోని చెరువు కట్ట వద్ద రోడ్డుపైనే భోజనాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షపు నీటితో పాటు ఇళ్లలోని మురుగు నీరు కూడా బీసీ కాలనీలో రోడ్లపైకి చేరటంతో స్థానికులు, కర్మకాండకు వచ్చిన బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.


మృతురాలి ఇంటికి వెళ్లే దారిలో రోడ్డుపై మురుగు నీరు


చెరువుకట్ట దగ్గర కర్మక్రియలకు ఏర్పాటు చేసిన భోజనాలు తింటున్న బంధువులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



నీళ్లలో కొట్టుకుపోతున్న పశువులు



కళత్తూరు దళితవాడను ముంచెత్తిన చెరువు నీరు

CTBTA DATE 07-11-2025


TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES

CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION

టుడే సప్లై రేట్ 116/- డ్రెస్డ్ స్కిన్‌తో 210/-

రిటైల్ లైవ్ బర్డ్ 141/- స్కిన్‌లెస్ 235/-





నీట మునిగిన పొలాలు



మంచంపై వృద్ధురాలి తరలింపు



జల విలయం

మేట వేసిన బురద. పశువుల కళేబరాలు. విరిగి పడిన కరెంటు స్తంభాలు. కొట్టుకొచ్చిన ట్రాక్టర్లు, ఆటోలు. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు. ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు.. బురద మట్టి. రాయలచెరువు కట్ట తెగడంతో కేవీబీపురం కళత్తూరు దళితవాడలో జలవిలయం సృష్టించిన భీతావహ దృశ్యమిది. ముందస్తు సమాచారంతో జనం మిద్దెలెక్కారు. ఎత్తయిన చోట్లకు వెళ్లారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. సునామీలా విరుచుకు పడిన వరద ఉధ్రుతిలో ఊరటనిచ్చే విషయం ఇది.

- కేవీబీపురం/సత్యవేడు/ శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

- ఓళ్లూరు రాయల చెరువుకు గండి
- ముంచెత్తిన నీటితో బురదమయమైన కళత్తూరు దళితవాడ
- పాడి పశువులు, జీవాలు మృతి
- ముందస్తు సమాచారంతో తప్పిన ప్రాణనష్టం

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే..

పాతపాళెంలో రెండు కొండల మధ్య 153 ఎకరాల విస్తీర్ణంలో రాయల చెరువు ఉంది. మూడు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. చెరువు నీటి సామర్థ్యం 0.88 టీఎంసీలు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకంలో భాగంగా చెరువు కట్టను పటిష్ట పరిచింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెరువు కట్టల నిర్వహణను గాలికొదిలేసింది. ఈ నిర్లక్ష్యమే రాయల చెరువు కట్ట తెగడానికి కారణమని స్థానికులు అంటున్నారు. ఈ చెరువు ఖాళీ కావడంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రి వేళ జరిగి ఉంటే..

రాయల చెరువు కట్ట రాత్రి.. లేదా తెల్లవారుజామున తెగి ఉంటే.. ఈ ఆలోచనకే కళత్తూరు దళితవాడ వణికిపోతోంది. తామంతా నిద్రించే వేళ చెరువు నీరు ముంచెత్తిఉంటే.. ప్రాణాలతో బయటపడే వాళ్లం కాదని అంటున్నారు. సర్వం కోల్పోయినా ప్రాణాలు దక్కాయని చెబుతున్నారు.

సర్వంకోల్పోయిన వారెందరో?

పది అడుగుల మేర నీటి ప్రవాహంతో చాలా ఇళ్లల్లోని వస్తువులు కొట్టుకుపోయాయి. ఇళ్లల్లోని ధాన్యం, బియ్యం, నగదు, సర్టిఫికెట్లు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ట్రాలీలు, చెనిక్కాయమిషన్ వంటివి నీటిలో కొట్టుకుని ఎక్కడ పడితే అక్కడ చెల్లా చెదరుగా పడ్డాయి.500కుపైగా ఆవులు, గేదెలు చనిపోయినట్లు అంచనా. మిగిలినవి గల్లంతయ్యాయి. మేకలు, గొర్రెలు, కోళ్లు ఎన్ని చనిపోయాయో తెలియదు. కళత్తూరు, కళత్తూరు దళితవాడల్లోని ఇళ్లల్లో బురద పేరుకుపోవడంతో సామాన్లు పనికిరాకుండా పోయాయి. చాలామంది కట్టుబట్టలతో బయటపడ్డారు. వందకుపైగా విద్యుత్‌స్తంభాలు నేలమట్టం అయ్యాయని అంచనా. పంటలు దెబ్బతినగా, పొలాలన్నీ ధ్వంసమయ్యాయి.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 900 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. నాలుగురోజుల పాటు వీరికి బస, ఆహారం అందించనున్నారు. ప్రతి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.3వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేయనున్నారు.



ఆదర్శ పాఠశాలలో..

ఇలా ముంచెత్తింది

గురువారం ఉదయం 6 గంటలు: ఓళూరు రాయలచెరువుకు గండి పడింది. దీనిని గుర్తించిన రైతులు, కూలీలు పాతపాళెం, ఓళూరు, వేమలపూడి, ఎస్ఎల్ పురం, కళత్తూరు ప్రజలను అప్రమత్తం చేశారు. **7 గంటలు:** పాతపాళెం ఎస్టీ కాలనీ నుంచీ కళత్తూరులోకి చెరువునీరు వచ్చింది. **8 గంటలు:** గండి కాస్త పెద్దది కావడం.. కట్ట తెగిపోవడంతో ప్రవాహం ఉధ్రుతంగా మారింది. **9 గంటలు:** వరద.. ఉప్పెనలా మారి కళత్తూరు దళితవాడపై విరుచుకుపడింది. 10 నుంచి 12 అడుగుల ఎత్తు వరకు ప్రవహించింది. ప్రజలు మిద్దెలపై ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. **10 గంటలు:** వరద ప్రవాహం కొనసాగుతూ గ్రామాన్ని ముంచెత్తింది. గంటన్నర వ్యవధిలో కకావికలం చేసింది.



కొట్టుకొచ్చిన ట్రాక్టర్



చనిపోయిన పశువుల వివరాల సేకరణ

కొనసాగుతున్న సహాయక చర్యలు

ఎమ్మెల్యే ఆదిమూలం, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ గ్రామానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగి వరద నీటి మళ్లింపు, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను ప్రారంభించారు. కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడుకు చెందిన సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరు నుంచి అగ్ని మాపక సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సమీప గ్రామాల వారు ప్రజలకు ఆహారం, నీరు అందించారు. నిరాశ్రయులకు రైతు సంఘం అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు తదితరులు మధ్యాహ్న భోజనం, తాగునీటి వసతి కల్పించారు.వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు నష్టం వివరాలు సేకరిస్తున్నారు.నవంబరు చివరిలో నాట్లు వేసేందుకు రైతులు నార్లు పోస్తున్నారు. దీంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం తప్పింది. కాగా, సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్ దళితవాడలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ధైర్యం చెప్పారు.



జల విలయం మిగిల్చిన క(న)ష్టం

అమరరాజ | ఎనర్జీ & మొబిలిటీ

AMARA RAJA Gotta be a better way

అమర రాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

CIN: L31402AP1985PLC005305

రిజిస్టర్డు ఆఫీసు: రేణిగుంట- కడప రోడ్, కరకంబాడి, తిరుపతి, ఆంధ్రప్రదేశ్- 517520

కార్పొరేట్ ఆఫీసు: టెర్మినల్ ఎ, 1-18/1/AMR/NR, నానక్‌రామ్ గూడ, గచ్చిబౌలి, హైదరాబాద్- 500032

ఇమెయిల్ ఐడి: investorservices@amararaja.com

వెబ్‌సైట్: www.amararajaeandm.com

ఫోన్: 91 (40) 23139000, ఫ్యాక్స్: 91 (40) 23139001

మధ్యంతర డివిడెండ్ కొరకు రికార్డు డేట్ ప్రకటన

కంపెనీల చట్టం 2013 సెక్షను 91 మరియు దాని కింద గల నిబంధనలు మరియు సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 42 ప్రకారం నోటీసు ఇవ్వబడేదేమంటే, నవంబరు 6 2025న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ జరిపిన తమ సమావేశంలో, ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు ఈక్విటీ షేర్ ఒక్కింటికి రూ5.40 (540%) మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించారు. సదరు మధ్యంతర డివిడెండ్‌ను స్వీకరించుటకు అర్హులైన వాటాదారులను నిర్ణయించుటకు అనగా రిజిస్టర్ ఆఫ్ మెంబర్స్ ఆఫ్ కంపెనీలో తమ పేర్లున్న వారు లేదా వాటాల లబ్ధిదారు యజమానులుగా డిపాజిటరీస్ రికార్డులలో చేర్చుటకు రికార్డు తేది గురువారం, నవంబర్ 13, 2025.

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

హైదరాబాద్ | సం/- వికాస్ సభర్వాల్

నవంబరు 6, 2025. | కంపెనీ సెక్రెటరీ & వైస్ ప్రెసిడెంట్-లీగల్.

మాజీ మంత్రి రోజాకు పరాభవం

- వడమాలపేట ఎంపీపీపై వీగిన అవిశ్వాసం ● డుమ్మా కొట్టిన నలుగురు ఎంపీటీసీలు



అవిశ్వాస తీర్మాన దరఖాస్తును పరిశీలిస్తున్న ఆర్డీవో

తిరుపతి/ వడమాలపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గంలో.. అందునా సొంత పార్టీలోనే మాజీ మంత్రి రోజాకు మరో సారి పరాభవం ఎదురైంది. గత ఐదేళ్లు బలమైన నేతలను వ్యతిరేకం చేసుకుని పలుమార్లు పార్టీపై పట్టు కోల్పోయే పరిస్థితి తెచ్చుకున్న ఆమె.. తాజాగా వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం విషయంలోనూ ఎదురుదెబ్బ తిన్నారు. వడమాలపేట మండలంలో 9 ఎంపీటీసీ స్థానాల్లో.. రెండింటికి కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు జరగలేదు. మిగిలిన ఏడూ వైసీపీయే గెలుచుకుంది. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు అయింది. ఇద్దరు ఎంపీపీ పదవిని ఆశించడంతో మధ్యేమార్గంగా తొలి రెండున్నరేళ్లు విజయలక్ష్మి, మలి సగం ఏఎం పురం ఎంపీటీసీ పుష్పలత ఎంపీపీగా కొనసాగేలా అంతర్గతంగా ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఇదంతా అప్పటి మంత్రి రోజా సమక్షంలోనే జరిగినట్టు ఆ మండల వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికి నాలుగేళ్లు దాటినా నాటి ఒప్పందం అమలు కాలేదు. దీనిపై ఎన్నిసార్లు పంచాయితీలు జరిగినా ఒప్పందం మేరకు ఎంపీపీ పదవీ మార్పిడి జరగలేదు. దీంతో ఏడుగురు ఎంపీటీసీలలో ఎంపీపీ మినహా మిగిలిన ఆరుగురూ కలిసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ ఆరుగురికీ మాజీ మంత్రి రోజా మద్దతు ఉందన్న ప్రచారం జరిగింది. ఆమె సూచనల మేరకే గత నెల 15వ తేదీన ఆరుగురు ఎంపీటీసీలూ తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌ను కలసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారని తెలిసింది. తిరుపతి ఆర్డీవో గురువారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఏడుగురు ఎంపీటీసీలు ఉండగా ఏఎంపురం, పత్తి పుత్తూరు ఎంపీటీసీలు పుష్పలత, ప్రతిమ మాత్రమే హాజరయ్యారు. అదనంగా గంట సమయం కేటాయించినా మిగిలిన వారు రాలేదు. అవిశ్వాస తీర్మానం అందించిన ఆరుగురిలో నలుగురు గైర్హాజరు కావడం గమనార్హం. కోరం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగి పోయినట్లు ఆర్డీవో రామ్మోహన్ ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఏవో హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శుక్రవారం తిరుమలలో జరుగనుంది. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేస్తారు. తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై భక్తులు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌తో ఫోన్ ద్వారా మాట్లాడవచ్చు. ఇందుకోసం 0877 2263261 నెంబరును సంప్రదించాలి.

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

AMARA RAJA Gotta be a better way

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

CIN: L31402AP1985PLC005305

నమోదిత కార్యాలయం: రేణిగుంట – కడప రోడ్, కరకంబాడి, తిరుపతి– 517520, ఆంధ్రప్రదేశ్

ఫోన్: 91 (877) 2265000, ఫ్యాక్స్: 91 (877) 2285600.

ఇమెయిల్ ఐడి: investorservices@amararaja.com వెబ్‌సైట్: www.amararajaeandm.com

30 సెప్టెంబర్ 2025తో ముగిసిన త్రైమాసిక మరియు అర్ధవార్షిక కాలానికి స్వతంత్ర మరియు ఏకీకృత ఫలితాల నివేదిక నుండి సంగ్రహం రూ.కోట్లలో

వివరాలు	స్వతంత్ర ఫలితాలు						ఏకీకృత ఫలితాలు					
	ఈ తేదీలతో ముగిసిన త్రైమాసిక కాలం			ఈ తేదీలతో ముగిసిన అర్ధ వార్షిక కాలం		ఈ తేదీలతో ముగిసిన వార్షిక కాలం	ఈ తేదీతో ముగిసిన త్రైమాసిక కాలం			ఈ తేదీలతో ముగిసిన అర్ధ వార్షిక కాలం		ఈ తేదీలతో ముగిసిన వార్షిక కాలం
	30.09.2025	30.06.2025	30.09.2024	30.09.2025	30.09.2024	31.03.2025	30.09.2025	30.06.2025	30.09.2024	30.09.2025	30.09.2024	31.03.2025
	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి
కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం	3,388.18	3,349.92	3,135.83	6,738.10	6,267.02	12,404.89	3,467.02	3,401.08	3,250.73	6,868.10	6,513.78	12,846.32
సదరు వ్యవధికి నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	283.76	261.01	323.97	544.77	652.63	1,188.08	243.03	228.92	317.07	471.95	651.78	1,162.10
పన్నుకు ముందు వ్యవధికి నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తర్వాత)	405.55	261.01	323.97	666.56	652.63	1,299.15	364.82	228.92	317.07	593.74	651.78	1,273.17
పన్ను తర్వాత వ్యవధికి నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తర్వాత)	302.40	194.01	240.71	496.41	485.26	963.90	276.49	164.80	235.61	441.29	484.73	944.67
సదరు వ్యవధికి మొత్తము సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత లాభంతోపాటు మరియు పన్ను తర్వాత ఇతర సమగ్ర ఆదాయం)	305.14	193.37	260.76	498.51	561.37	799.97	279.10	164.16	255.25	443.26	560.44	780.75
చెల్లించిన ఈక్విటీ వాటామూలధనం (ముఖ విలువ రూ. 1/- ఒక్కింటికి)	18.30	18.30	17.08	18.30	17.08	18.30	18.30	18.30	17.08	18.30	17.08	18.30
గత సంవత్సరం ఆడిట్ చేసిన ఆస్తి అప్పులపట్టీలో చూపిన విధంగా రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)	-	-	-	-	-	7,359.97	-	-	-	-	-	7,370.83
ప్రతి వాటాకు వచ్చిన ఆర్జనలు (రూ. 1/- ఒక్కింటికి) (సదరు కాలానికి -వార్షికరించబడలేదు) -బేసిక్ /డైల్యూటెడ్	16.52	10.60	13.15	27.12	26.51	52.66	15.11	9.00	12.87	24.11	26.48	51.61

గమనిక: 1. SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజిలకు దాఖలు చేసిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల నివేదిక సంగ్రహమే పైన పేర్కొనబడినది. త్రైమాసిక/అర్ధ వార్షిక ఆర్థిక ఫలితాల మరియు అపై నోట్స్ యొక్క సమగ్ర నమూనా స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్స్ (www.nseindia.comమరియు www.bseindia.com)నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ అనగా www.amararajaeandm.com నందు లభ్యమగును.
2. 06 నవంబర్ 2025న జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 42 మరియు అందులో రూపొందించబడిన నిబంధనలు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 91ని అనుగుణంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈక్విటీ వాటా ఒక్కింటికి రూ.5.40/- (540%) మధ్యంతర డివిడెండ్‌ను సిఫారసు చేశారని ఇందుమూలముగా తెలియజేయడమైనది. సదరు మధ్యంతర డివిడెండ్‌ను అందుకొనుటకు హక్కుగల వాటాదార్లను నిర్ణయించుటకు రికార్డు తేది గురువారము, 13 నవంబర్ 2025.
3. ఇప్పటికీ తమ ఇమెయిల్ చిరునామా రిజిస్టర్/ అప్‌డేట్ చేసుకోని కంపెనీ వాటాదారులు వారి డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో వారి ఇమెయిల్ చిరునామాను రిజిస్టర్/ అప్‌డేట్ చేసుకోవల్సిందిగా లేదా రిజిస్ట్రేషన్ / అప్‌డేషన్ కొరకు వారి ఫోలియో నెం./ DPID CL ID మరియు చెల్లుబాటులో ఉన్న ఇమెయిల్ చిరునామాతోపాటు investor@cameoindia.com లేదా investorservices@amararaja.comకు తమ సమ్మతిని పంపవల్సిందిగా విజ్ఞప్తి.

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

ప్రదేశం: హైదరాబాద్ | సం/– జయదేవ్ గల్లా

తేది: 06 నవంబర్ 2025 | DIN: 00143610

చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ & CEO

శ్రీవారి సేవలో ప్రముఖులు



నీరబ్‌కుమార్ ప్రసాద్

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో- ఏపీ మాజీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, తెలంగాణ హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఉన్నారు.


రుయాలో డాక్టర్ల ఘర్షణ

డాక్టర్‌పై చేయి చేసుకున్న మరో వైద్యుడు

విచారణ చేపట్టిన అధికారులు

తిరుపతి(వైద్యం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై ప్రైవేటు వైద్య కళాశాలకు చెందిన మరో వైద్యులు దాడికి పాల్పడిన ఘటన గురువారం రుయాస్పత్రిలో చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో పీజీ డాక్టర్లకు పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం పరీక్షలు ముగిశాయి. అపోలో వైద్యశాలకు చెందిన పీజీ వైద్యులు పరీక్ష ఎలా రాశారు అనే విషయం తెలుసుకునేందుకు ఆ కళాశాల తరఫున ఎగ్జామినర్‌గా వచ్చిన డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పరీక్షల విధుల్లో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసులు దగ్గరకు వచ్చారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. గురువారం మళ్లీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి రుయాస్పత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ శ్రీనివాసులు వద్దకు వచ్చారు. గంటల తరబడి శ్రీనివాసులరెడ్డిని విభాగం ముందే నిరీక్షింపజేశారు. సహనం కోల్పోయిన శ్రీనివాసులరెడ్డి డాక్టర్ శ్రీనివాసులు గదిలోకి వెళ్లి ఆయనపై చేయి చేసుకున్నారు. దీంతో ఇరువురు దాడులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఇతర వైద్యులు గుర్తించి సర్దిచెప్పారు. ఈ విషయంపై ఇరువురు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభ, రుయా సూపరింటెండెంట్ రాధలకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వారు విచారణ చేపట్టారు. దాడి జరిగిన మాట వాస్తవమేనని, కారణాలపై విచారణ చేపడుతున్నామని, పూర్తి వివరాలు తెలుసుకున్నాక తగు చర్యలు చేపడతామని ప్రిన్సిపల్ రవిప్రభ తెలిపారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,239

తలనీలాలు సమర్పించినవారు: 23,436

మహిళలకు వరం పింక్ బస్సు

స్విమ్స్‌లోని పింక్ బస్సు ద్వారా 2018 నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో నోటి క్యాన్సర్‌ను గుర్తించేందు పరీక్షలు, బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణకు రొమ్ము పరీక్ష, మామో గ్రామ్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, పెట్ సిటీ, లీనియర్ ఎక్సలేటర్ మొదలగు పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తించేందుకు పాప్ స్మియర్ పరీక్ష కూడా పింక్ బస్సులో అందుబాటులో ఉంది.

పింక్ బస్సు సేవలు

- నిర్వహించిన మొత్తం క్యాంపులు : 692
- స్క్రీనింగ్ చేసిన రోగుల సంఖ్య : 41,783
- చికిత్స తీసుకున్నవారి సంఖ్య : 744(ఆపరేషన్లతో కలిపి)
- 2025లో (జనవరి నుంచి అక్టోబరువరకు) ఓపీల సంఖ్య :21037, ఐపీ :5917



త్వరలో ప్రారంభం కానున్న శ్రీబయో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం :



క్యాన్సర్ భూతం కాదు

జబ్బు మాత్రమే

తిరుపతి

ఆంధ్రజ్యోతి

క్యాన్సర్ అనే పేరు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఆందోళన, భయం మొదలవుతుంది. క్యాన్సర్ అని నిర్ధారణ అయిన వారితో పాటూ వారి కుటుంబ సభ్యుల్లోనూ, ఆత్మీయుల్లోనూ నిరాశ పేరుకుంటుంది. ఒక అసక్తత అసహనంగా మారుతుంది. అయితే క్యాన్సర్ అన్నది ఇప్పుడు మరణానికి సంకేతపదం కానేకాదు. వైద్యరంగంలో జరిగిన ఆవిష్కరణలు, కనుగొన్న మందులు, అనుసరిస్తున్న వైద్య విధానాలు.. కేన్సర్‌ను నిరోధించడమే కాదు, నియంత్రించగలుగుతున్నాయి. కేన్సర్ అని నిర్ధారణ అయినవారిలో పోరాడి గెలవాలనే పట్టుదల, వారికి స్థైర్యాన్నిచ్చే కుటుంబ సభ్యులు ఉంటే అద్భుతాలు కూడా జరుగుతాయి. క్యాన్సర్ ఎందుకు వస్తుందో కారణాలు అనేకం ఉండచ్చు కానీ మొదట్లోనే గుర్తించి వైద్యం మొదలు పెడితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఇలా చికిత్సతో క్యాన్సర్‌ను జయించిన వారు ఎందరో ఉన్నారు. చివరి స్టేజ్‌లో ఆస్పత్రిమెట్లెక్కి కరెంటు, కీమో థెరపీలతో పోరాడి గెలిచినవారూ ఉన్నారు. కాబట్టి క్యాన్సర్ అన్నది గతంలోలా ఇప్పుడు కబళించే భూతం కాదు. అది కూడా వైద్యంతో నియంత్రించగల ఒక జబ్బు మాత్రమే అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, స్వీకార్ డైరెక్టర్ ప్రశాంత్ చెబుతున్నారు. తిరుపతిలో క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు తగిన వైద్యం అందుబాటులో ఉందంటూ ఆ వివరాలు తెలియజేశారు.

తిరుపతిలో స్విమ్స్‌తో పాటు టాటా కాన్సర్ (స్వీకార్) ఆస్పత్రులలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స లభిస్తున్నాయి. స్విమ్స్, స్వీకార్ వంటి వైద్య సంస్థలు 'క్యాన్సర్‌ను జయిద్దాం'...అంటూ సామాజిక ప్రచారాలు, వాక్‌థాన్, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నాయి. డోర్ టూ డోర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాల ద్వారా ముందస్తు గుర్తింపు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో క్యాన్సర్ అని అనుమానం వస్తే నిర్ధారణ కోసం వైద్యనిపుణులు పరీక్షలను సూచిస్తున్నారు. బ్రెస్ట్ కాన్సర్‌పై జాగ్రత్తలు, మహిళలకు స్వీయ పరీక్ష గురించి అవగాహన కలిగిస్తున్నారు. సర్జికల్ చికిత్సతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నగదు ఖర్చు లేకుండా అందుతున్నాయి. ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో సర్జికల్, రేడియేషన్ చికిత్స లేనప్పటికీ ఓపీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.



స్విమ్స్ క్యాన్సర్ విభాగంలో త్వరలో అందుబాటులోకి రానున్న లీనియర్ యాక్సిలేటర్

టీటీడీ సాయంతో త్వరలో 'శ్రీబయో'

క్యాన్సర్ నివారణకు ప్రభుత్వంతో పాటు టీటీడీ సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రస్తుతం స్విమ్స్ క్యాన్సర్ విభాగం కోసం రూ118 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. అత్యాధునికమైన వైద్య సదుపాయాలతో 391 పడకలతో పూర్తి స్థాయిలో శ్రీ బాలాజి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (శ్రీబయో)ని జనవరిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. క్యాన్సర్ విభాగానికి టీటీడీ రూ184 కోట్ల నిధులు కేటాయించింది. ఈ విభాగంలో లీనియర్ యాక్సలేటర్‌కు రూ24కోట్లు వెచ్చిస్తున్నారు. పెట్, గామా స్కాన్ : రూ23కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇంకా సీఎస్ఎస్‌డీ : రూ14కోట్లు, ఎంఆర్ఐకి రూ8కోట్లు వ్యయం చేస్తున్నారు.

ఏడాదికి 3వేలు పైనే

గత మూడేళ్ల గణాంకాల ప్రకారం ప్రతిఏటా సుమారు 3వేల నుంచి 3500 కొత్త క్యాన్సర్ కేసులు గుర్తిస్తున్నారు. తిరుపతి జిల్లాలో నోటి(ఓరల్), బ్రెస్ట్ (స్తన), సర్వికల్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయంలో క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

స్విమ్స్‌లో ఇవి ఉన్నాయి

క్యాన్సర్ రోగుల సౌకర్యార్థం స్విమ్స్‌లో ఓ ఎంఆర్ఐ, సిటీ, పెట్ స్కాన్‌తో పాటు తాజాగా గామా కెమెరా, లినాక్ వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి అటామిక్ ఎనార్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్బీ)) అనుమతులు ప్రక్రియ కొనసాగుతోంది. అనుమతులు లభించిన వెంటనే ఈ యంత్రాలను జనవరి నుంచి అందుబాటులోకి తీసుకుని రావడానికి ప్రణాళికలు రూపొందించారు.

పాలియేటివ్ కేర్:

చికిత్సకు లొంగకుండా చివరి దశలో ఉన్న రోగులకు పాలియేటివ్ కేర్ చాలా ముఖ్యం. స్విమ్స్‌లో క్యాన్సర్ పేషంట్ల కోసం పాలియేటివ్ కేర్ (ఉపశమన చికిత్స) విభాగం ఉంది. ఇప్పటి వరకు ఈ విభాగం ద్వారా దాదాపు 610 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వివిధ ఉపశమన చికిత్సలు అందించారు. భవిష్యత్తులో దీనిని మరింతగా విస్తరించబోతున్నారు.

స్వీకార్‌లో ఇలా..

శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్(స్వీకార్), టాటా ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు స్తన క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కోసం ఉచిత స్క్రీనింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 60వేల మందికి పైగా వ్యక్తులు ఈ స్క్రీనింగ్ సేవలను పొందారు.

- ఓపీడీ : 152657
- కీమోథెరపీ : 32405
- రేడియేథెరపీ : 49608
- బ్రాకీ థెరపీ : 996
- సర్జరీలు : 3537

జిల్లాలో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు: స్తన (బ్రెస్ట్), గర్భాశయ ముఖద్వార, నోటి, ఊపిరితిత్తులు, కడుపు, పెద్దపేగు క్యాన్సర్లు.

ఇవి అవసరం

క్యాన్సర్ చికిత్సలో జరుగుతున్న పరిశోధనల ఫలితంగా అనేకరకాల ఆధునిక సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుపతికి పీడియాట్రిక్ ఆంకాలజీ (శిశు క్యాన్సర్ వైద్యం), బీఎంటీ (బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్) ఎముకమజ్జ మార్పిడి , రేడియోఆక్టివ్ అయోడిన్ చికిత్స విభాగాలు అవసరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. టీటీడీ ముందుకొచ్చి వీటిని కూడా అందుబాటులోకి తీసుకొస్తే క్యాన్సర్ బాధితులకు వరప్రసాదినిగా మిగిలిపోతుంది.

ఆస్తి నష్టం రూ.30 కోట్లు!

- 2 వేల ఎకరాల్లో ఇసుక మేట
- ముంపునకు గురైన 700 కుటుంబాలు
- ప్రభుత్వానికి తాత్కాలిక నివేదిక
- కట్ట నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పాతపాళెం వద్ద ఓళ్లూరు చెరువు కట్ట గురువారం తెగడంతో సుమారు రూ.30 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశారు. కళత్తూరు హరిజనవాడలో 700 కుటుంబాలు ముంపునకు గురికాగా, ఎస్ఎల్‌పురంలో 40, పాతపాళెంలో 300 కుటుంబాలకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. కళత్తూరు దళితవాడలో సుమారు 200మూగజీవాలు కొట్టుకుపోయినట్లు అంచనా. ఓ కుటుంబానికి రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లింది. రాయలచెరువు కట్ట శాశ్వత నిర్మాణానికి రూ.6కోట్లకుపైగా అవసరం. కేటీ రోడ్డు నుంచిదిగువపురం వద్ద కల్వర్టు, రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.20లక్షలు.. శాశ్వత మర్మతులకు అయితే రూ.3కోట్లు అవసరం కానుంది. 170 కరెంటు స్తంభాలు కూలిపోయాయి. చెరువు దిగువ భాగాన రెండు వేల ఎకరాల్లో ఇసుక మేట వేయగా, కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. 60 ఎకరాల్లో వేరుశనగ కొట్టుకుపోయింది. దాదాపు వెయ్యి కుటుంబాలు బాధితులుగా నిలిచారు. కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గురువారం రాత్రి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇక 200మంది పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన కళత్తూరు గ్రామంలో పారిశుధ్య పనులుచేపట్టారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవిఅ క్కడే బస చేసి బాధితులకు అన్ని సహాయ సహకారాలు అందించేందుకు చర్యలుచేపడుతున్నారు. చనిపోయిన ఆవు, గేదెకు, రూ.50వేలు, మేకకు రూ.7,500 వంతున నష్టపరిహారం అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వైద్య సేవలతో పాటురిలీఫ్‌సెంటర్లతో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు హౌసింగ్ పథకం కింద నిర్మిస్తామన్నారు. చెరువు కట్ట తెగడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్







పోలీసు ఆన్ రెస్క్యూ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కళత్తూరు దళితవాడలో సహాయక చర్యలకోసం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సీఐలు, ఎస్ఐలు, కేవీబీపురం, సత్యవేడు, పిచ్చాటూరు, పోలీసు స్టేషన్ల సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఘటనాస్థలికి చేరకుని పరిస్థితిని పరిశీలించారు. ఎప్పటి కప్పుడు నీటి మట్టం మార్పులను గమనిస్తూ గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందితో కలసి సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 500 ఇళ్లు నీట మునిగే పరిస్థితి ఏర్పడినా సమయోచిత చర్యలతో ప్రజలను సురక్షితంగా తరలించగలిగామని ఎస్పీ చెప్పారు. అత్యవసర పరిస్థితిలో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎస్పీ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

రెండోరోజూ ఏసీబీ సోదాలు

- పలు అక్రమ రిజిస్ట్రేషన్లు గుర్తింపు ?

రేణిగుంట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన గురువారం కూడా ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. కార్యాలయానికి తాళం వేసి మరీ రికార్డులను నిశితంగా పరిశీలించారు. తాత్కాలికంగా క్రయ, విక్రయాలను నిలిపివేశారు. తిరుపతి రూరల్ పరిధిలోని 22 ఏ నిషేధిత జాబితాలోని మఠం భూములు, శ్రీనివాసపురం, పద్మావతిపురంలోని ఇళ్ల స్థలాలకు, ఇళ్లకు డీఐజీ, జిల్లా అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి నేరుగా వ్యక్తిగత సహాయకుడు, ఓ డాక్యుమెంట్ రైటర్, అతని తమ్ముడు ద్వారా చట్టంలోని లొసుగుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. పట్టా భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములకు సదరు భూమి నెంబర్ వేసి రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇతర జిల్లాల (ఎనీవేర్) రిజిస్ట్రేషన్ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు తనిఖీలలో గుర్తించిన అక్రమ రిజిస్ట్రేషన్లపై ప్రొసీడింగ్స్ రూపొందిస్తుండడంతో తనిఖీలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఐ ఏసీబీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులు పంపకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువకుడి దారుణ హత్య

- సంప్‌లో బయటపడిన మృతదేహం

రేణిగుంట నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ యువకుడు హత్యకు గురైన వైనం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం రేణిగుంట పంచాయతీ పరిధిలోని నేతాజీ కాలనీకి ఆనుకొని ఉన్న ఓ నిర్మానుష్య ప్రదేశం వద్దకు గురువారం కొంత మంది యువకులు మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడి ఖాళీ భవనం నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో వారు సమీపంలోని సంపులో పరిశీలించారు. అందులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే గాజుల మండ్యం పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ సుధాకర్‌లు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఎక్కడో హత్య చేసి రెండు రోజుల క్రితం కాళ్లు చేతులు కట్టేసి మృతదేహాన్ని సంపులో పడేసి ఉంటారని డీఎస్పీ చెప్పారు. మృతదేహం గుర్తించలేని విధంగా కుళ్లిపోయిందన్నారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. హత్య కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. హత్యకు గురైన యువకుడు సమీ ప్రాంతానికి చెందినవాడిగా అనుమానిస్తున్నారు. అక్రమ సంబంధమా, ఆర్థిక లావాదేవీలా అనే కోణంలో విచారిస్తున్నారు. క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కాళ్లు చేతులకు కట్టేసి ఉన్న మృతదేహం

ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసర్ సస్పెన్షన్

- ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని అధికారుల ప్రాథమిక నిర్ధారణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీ సైకాలజీ విభాగ ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరెడ్డి సస్పెండ్ అయ్యారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈనెల ఒకటో తేదీన సైకాలజీ విభాగంలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేశారని, ఇది ఆయన నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అది నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నంత కాలం తిరుపతి నుంచి వెలుపలకు వెళ్లకూడదని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధిత అధికారుల అనుమతి అవసరమని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సగం వేతనంతో జీవనాధార భత్యం చెల్లిస్తారు.



ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి

నీటిపాలైన బతుకు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో గురువారం రాయలచెరువు కట్ట తెగడంతో కళత్తూరు దళితవాడ జనం తీవ్రంగా నష్టపోయారు. ఎటు చూసినా ఆవేదనే. 700 కుటుంబాల వరకు ముంపునకు గురయ్యాయి. బాధితుల ఆవేదన వారి మాటల్లోనే..

భారీగా పశు నష్టం



నేను నెల్లూరులో పశువైద్య విద్య అభ్యసిస్తున్నా. పశువుల పెంపకంపై ఆసక్తితో దేశవాళీ రకమైన ఒంగోలు జాతి ఆవులు, ఎద్దులు, పాడిగేదెలను ఇంటి వద్ద మేపుతుంటా. పది ఒంగోలు ఆవులు, నాలుగు ఒంగోలు జాతి పాడిగేదెలు, 16మేకలు నీటిలో కొట్టుకుపోయాయి. ఏం చేయాలో దిక్కు తోచడంలేదు.

\- సునీల్

కూడు దొరికే మార్గమేదీ?



గేదెల ద్వారా పాలు అమ్ముకుని ఇద్దరు ఆడబిడ్డలను చదివించుకుంటున్నా. ఆ నాలుగు గేదెలు ఒకేసారి కడతేరిపోయాయి. రేపటి నుంచి మా కుటుంబానికి కూడుదొరికే మార్గంలేదు.

\- సుకన్య

మొదటిఇల్లు మాదే



సెల్‌ఫోన్ల ద్వారా చెరువు తెగిన విషయం తెలిసి జనాలు పరుగెత్తారు. నాకు ఫోన్ లేకపోవడంతో ఆలస్యంగా తెలిసింది. మాది రేకుల ఇల్లు కావడంతో బిడ్డలను తీసుకుని ఎక్కడికి పోవాలో అర్థం కాలేదు. దక్షిణ వైపు నుంచి పొలాల్లో నీటి ప్రవాహం పరుగులుపెడుతున్న దృశ్యం కనిపించింది. ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలను సంకన వేసుకుని ఊరిలోకి పరుగులు తీసి ఓ మిద్దెపైకి ఎక్కా. మొదట నీటి ప్రవాహం మా ఇంటినే తాకింది. ఏ వస్తువూ మిగలలేదు.

\- సంపూర్ణమ్మ

ఎలా బతకాలి?



నాలుగు ఇనుప రేకులతో చుట్టూ తడికలుగాపెట్టుకుని బతికే నిరుపేద కుటుంబం మాది. నీటి ప్రవాహంలో తట్టా బుట్ట కొట్టుకుపోయాయి. నాలుగు పాత గుడ్డలు తీసుకుని రోడ్డున పడ్డాం. ఎలా బతకాలో అర్థం కావడంలేదు.

\- రఘునమ్మ

50 ఏళ్లక్రితం ఇలాంటి ఘటనే



50ఏళ్ల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. కానీ ఇంత నష్టం లేదు. అప్పుడూ రాయలచెరువు నీళ్లు మా దళితవాడపై పడింది. నీటి ఉధ్రుతి తక్కువ కావడంతో కాలువ పొంగి ప్రవహించింది. కానీ ఇంతటి విపత్తు ఎపుడూ ఊహించలేదు.

\- మోషయ్య

అందరినీ అప్రమత్తంచేశాం



రాయలచెరువు కట్టకు బొగడ పడిందని పాతపాళెం నుంచి బంధువులు ఫోనుచేసి చెప్పారు. నాతో పాటు కళత్తూరు నుంచి 20మందినితోడుపెట్టుకుని ద్విచక్ర వాహనంలో చెరువు వద్దకెళ్లాం. మా కళ్లముందే నీటి ఉధృతి పెరిగి చెరువుకట్ట తెగిపోయింది. దీంతో ఇళ్లు వదిలి పారిపోవాలంటూ అందరికీ సెల్‌ఫోన్‌తో హెచ్చరికలు చేయడంతో మిద్దెలు ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.

\- అమాసయ్య

దాచుకున్న సొమ్ము పోయింది



నాకు ఇద్దరు ఆడపిల్లలు. చిల్లర దుకాణం ఉంది. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టా. దీనికి రూ.3లక్షలు నగదు, కొంత బంగారు నా దుకాణంలో ఉంచుకున్నా. దీంతో పాటు వస్తువులు మొత్తం పోయాయి.

\- సౌజన్య

బిడ్డకోసం తల్లడిల్లిపోయాం



నెల రోజుల క్రితం నేను మగబిడ్డకు జన్మనిచ్చా. ఊరిని ఉప్పెన తాకడంతో బిడ్డను కాపాడుకోవడానికి ఇంట్లో వాళ్లమంతా తల్లడిల్లిపోయాం. ప్రవాహం తగ్గడంతో పొరుగున ఉన్న రామగిరికి కట్టుబట్టలతో వెళుతున్నాం.

\- సుచిత్ర

యూరియాపై వైసీపీ అసత్య ప్రచారం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

దక్కిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూరియా విషయంలో వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ గోను రాజశేఖర్, మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, దక్కిలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు దక్కిలి చంద్రారెడ్డి విమర్శించారు. గురువారం వారు దక్కిలిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నట్లు వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. రైతులను భయాందోళనకు గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలన్న దురుద్దేశంతోనే వైసీపీ నేతలు విష ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కోసం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో నియోజకవర్గంలో రైతులకు చాలినంత యూరియా అందుతుందని చెప్పారు. వైసీపీ హయాంలో ఎకరాకు ఒక బస్తా యూరియా ఇచ్చి, బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోకూరు రమేష్ నాయుడు, దక్కిలి సునీల్ రెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, పిల్లి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి రత్నయ్య, గరిటి చెంచయ్య, సునీల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, ఆయిల్ నిక్షేపాల కోసం అన్వేషణ



సూరిశెట్టిపాళెం వద్ద భూముల్లో డ్రిల్లింగ్ చేస్తున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోట మండలం కొక్కుపాడు, సూరిశెట్టిపాళెం గ్రామాల్లో గ్యాస్, ఆయిల్ నిక్షేపాల కోసం గురువారం ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచ్యురల్ గ్యాస్ కార్పొరేషన్) అన్వేషణ ప్రారంభించింది. ఆయా గ్రామాల్లోని పొలాల్లో యంత్రాలతో డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. మరో రెండు రోజులపాటు ఈ పనులు డ్రిల్లింగ్ పనులు కొనసాగుతాయని ఓఎన్‌జీసీ పీఆర్వో సుధీర్ తెలిపారు. కోట మండలంలోని కొక్కుపాడు నుంచి కర్లపూడి, చిల్లకూరు మండలం కాకువారిపాళెం, బల్లవోలు గ్రామాల మీదుగా కృష్ణపట్నం పోర్టు వరకు శాటిలైట్ లోకేషన్ ద్వారా ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఇంధనం, గ్యాస్ నిక్షేపాల ఉనికి ఉందా, లేదా అనే విషయాలపై శాటిలైట్ విలేజ్‌ల ఆధారంగా డ్రిల్లింగ్ చేస్తున్నామని, డెల్టా ప్రాంతం కావడంతో ప్రస్తుతం 50నుంచి 60 అడుగుల లోతు మట్టిని తీసి ఓఎన్‌జీసీ పరీక్ష కేంద్రానికి పంపిస్తామని, మరోవైపు అంత లోతునుంచి అయిస్కాంత తరంగాల ద్వారా ప్రత్యేక పరికరాలు భూగర్భంలోకి పంపి గ్యాస్ నిక్షేపాలు ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తున్నామన్నారు. కోట మండలంలో ఇప్పటికి 4 ఓఎన్‌జీసీ బృందాలు అన్వేషణ ప్రారంభించాయని పీఆర్వో సుధీర్ పేర్కొన్నారు.

యూరియా కొరత లేదు



యూరియా పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు

చిట్టమూరు, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు అధైర్య పడొద్దని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న తీరప్రాంత గ్రామాలైన బురదగాలి కొత్తపాళెం, చిల్లమూరు, మొలకలపూడి గ్రామాల రైతులకు చిట్టమూరు సొసైటీ కార్యాలయం వద్ద గురువారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకపోయినప్పటికి కొంతమంది అసత్య ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. చిట్టమూరు మండలంలో ఇప్పటికే 4800 యూరియా కార్డులను పంపిణీ చేశామని చెప్పారు. మొదటి విడతగా 17వందల కార్డులకు 369 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేశామన్నారు. అనంతరం ఉప్పలమర్తి గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. అలాగే పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఆయన వెంట ఏడీవో ధనంజయరెడ్డి, చిట్టమూరు ఏవో నిరంజన్ కుమార్ ఉన్నారు.

యూరియా పంపిణీ

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు-1 రైతు సేవాకేంద్రంలో యూరియా పంపిణీని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, సస్యరక్షణ విభాగం, సహాయ వ్యవసాయ సంచాలకుడు ధనంజయరెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ రైతులందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దినేష్, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా ఇవ్వాలి

దొరవారిసత్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలని సర్పంచ్‌లు కోరారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన జరిగింది. నెల్లూరుపల్లి, అక్కరపాక, వెదురుపట్టు, నెలబల్లి సర్పంచ్‌లు యూరియా కొరతపై వ్యవసాయాధికారి జ్యోతిర్మయిని ప్రశ్నించారు. పట్టా ఉన్న రైతులకు ఇస్తున్నారని, కౌలు రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా తీసుకోవడం కోసం కార్డులు ఎందుకని ప్రశ్నించారు. దీనిపై ఏవో స్పందిస్తూ ఒకేసారి ఎక్కువ మొత్తంలో యూరియా తీసుకువచ్చి రైతులకు అందించే పరిస్థితి లేదని, దీంతో విడతల వారీగా ఇస్తున్నట్లు తెలిపారు. పట్టాలు లేని రైతులు వీఆర్వో వద్ద సాగు సర్టిఫికెట్ తీసుకువస్తే యూరియా ఇస్తామని చెప్పారు. ఇక మండలంలో రెవెన్యూ శాఖ అధికారుల తీరు బాగా లేదని, రైతులకు సేవలు అందించడం లేదని విమర్శించారు. సాగు సర్టిఫికెట్లు కావాలన్నా, అసైన్డ్ భూములపై వ్యవసాయ రుణాల రీషెడ్యూల్ కోసం సంతకాల కోసం వెళ్లిన రైతులను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, ఎంఈవో కృష్ణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు కలిసిన ఎమ్మెల్యేలు



మంత్రి నారా లోకేశ్‌కు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశిం సునీల్ కుమార్

గూడూరు/తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దగదర్తిలో టీడీపీ సీనియర్ నాయకుడు మాలేపాటి సుబ్బా నాయుడు దశదిన కార్యక్రమానికి హాజరైన మంత్రిని నారా లోకేశ్‌ను సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశిం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు కలిపేందుకు ప్రతిపాదనలు చేసినందుకు మంత్రి లోకేశ్‌కు సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రోక్తంగా సిద్ధకాలభైరవ హోమం

రామచంద్రాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాలభైరవ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో సిద్ధ కాలభైరవ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9 గంటలకు వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య సిద్ధ కాలభైరవ హోమాన్ని లక్ష గారెలతో పూర్తి చేశారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతితో హోమాన్ని ముగించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. పీఠాధిపతులు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.



నిమ్మకాయల అలంకారంలో కాలభైరవస్వామి

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఉరివేసుకుని ఆత్మహత్య

గూడూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గల ఓ నిమ్మతోటలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెంది వుండటాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ తిరుపతయ్య వివరాల మేరకు... మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని ఓ నిమ్మతోటలో 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి నిమ్మచెట్టుకు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదు రోజుల క్రితం మృతిచెంది వుండవచ్చని భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. బులుగు గళ్లచొక్కా ధరించి వున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్‌రావు

గూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రావు అన్నారు. గురువారం గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వాణి, నారాయణ, జలజాక్షి, గోపి, మోహన్, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం అయ్యవారిపాళెం గ్రామానికి చెందిన సందీప్ అనే విద్యార్థి వైద్య ఖర్చులకు చిల్లకూరు మండలం చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30వేలు అందజేశారు. బీఫార్మసీ చదువుతున్న సందీప్ అనారోగ్యానికి గురై బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల కోసం ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడును సంప్రదించడంతో రూ.30వేలు నగదు అందజేశారు.

టీడీపీ నేత కృష్ణమూర్తి తల్లి మృతి

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం మాజీ సర్పంచ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి తల్లి కృష్ణమ్మ(88) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఫోన్‌లో కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కృష్ణమ్మ(ఫైల్‌ఫొటో)

సర్పంచ్‌కు మాతృవియోగం



లీలావతమ్మ (ఫైల్‌ఫొటో)

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక పంచాయతీ సర్పంచ్ నల్లారెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి తల్లి నల్లారెడ్డి లీలావతమ్మ(90) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి వైసీపీ నాయకులు నివాళులర్పించారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



వంజివాకలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. మండల పరిధిలోని వంజివాక రైతుసేవా కేంద్రంలో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్ధవరం సహకార సంఘ చైర్మన్ పాదర్తి కోటేశ్వరరెడ్డి, ఏవో సుచేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు కొనిశెట్టి రమేష్, దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, నవంబరు, 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. రెండు రోజులుగా నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, చావాలి గ్రామాల వద్ద 71వ జాతీయ రహదారిపై స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నారు. పోలీసులు చేపట్టిన వేగ నియంత్రణ తనఖీలు గురువారం కూడా కొనసాగాయి. ఇటీవల చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలకు అధిక వేగమే ప్రధాన కారణంగా తేలుతున్న నేపథ్యంలో నివారణ చర్యలు చేపట్టామని ఎస్ఐ నాగరాజు చెప్పారు.

ఓవరాల్ చాంపియన్‌గా పద్మావతి మహిళా కళాశాల జట్టు

తిరుపతి(క్రీడలు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. రూ.90వేలు నగదు బహుమతి గెలుచుకుంది. గురువారం కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లో రాణిస్తుండటం కళాశాలకు, టీటీడీకి గర్వకారణమన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి బి.భారతి, భద్రమణి, పద్మశ్రీ పాల్గొన్నారు.



మహిళా క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

షార్‌ను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని గురువారం సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర షార్‌ను సందర్శించారు. ఆమెకు షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ స్వాగతం పలికారు. అనంతరం ఆమె షార్‌లోని రాకెట్ ప్రయోగ వేదికలు, స్పేస్ మ్యూజియాన్ని సందర్శించారు. రాకెట్ ప్రయోగాలు, ప్రయోగించిన ఉపగ్రహాల గురించి షార్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటలో కుండపోత వర్షం



జలదిగ్బంధంలో ఉన్న కోట పంచాయతీ కార్యాలయం

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో విద్యానగర్‌లో రోడ్లు జలమయమయ్యాయి. కోట, ఆకుతోట దిబ్బలో వర్షపునీరు నిల్వచేరి ఇళ్లల్లోకి వస్తుండటంతో ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ పంచాయతీ సిబ్బంది ద్వారా నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేపట్టారు. కోట పంచాయతీ కార్యాలయం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో సిబ్బంది అసౌకర్యానికి గురయ్యారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

ఐదుగురి అరెస్టు



పట్టుబడ్డ కోళ్లు, జూదరులతో పోలీసులు

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లిలో కోడి పందేల స్థావరంపై గురువారం ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశాడు. ఐదుగురి జూదరులను అరెస్టు చేశారు. ఐదు బైక్‌లు, మూడు కోడి పుంజులు, రూ.1850 స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజనులకు నిత్యావసర సరకులు



గ్రద్దగుంట గిరిజనులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సాయిగిరిధర్‌రెడ్డి, శివప్రసాద్

ఓజిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం గ్రద్దగుంట గిరిజనులకు గురువారం కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి నేతృత్వంలో ఆయన సోదరుడు సాయిగిరిధర్ రెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మల్లిశెట్టి శివప్రసాద్ చేతుల మీదుగా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సునీల్, చెంచయ్య పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

పెళ్లకూరు, నవంబరు, 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హరికృష్ణకు ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు శోభన్‌బాబు తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. రీసర్వే కారణంగా అనేక మంది రైతులకు 1బీ, ఎల్‌పీఎం నంబర్లు ఆన్‌లైన్‌లో రావడంలేదని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదన్నారు.

కొండాపురంలో కోటి సంతకాల సేకరణ

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ మండల అధ్యక్షుడు ఏనుగు సుధాకర్‌నాయుడు మండలంలోని కొండాపురంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధురెడ్డి పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో 'ఖ్యాతి'

తిరుపతి(క్రీడలు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు జరిగిన 37వ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో తిరుపతికి చెందిన కె.ఖ్యాతి అత్యుత్తమంగా రాణించింది. రోడ్ 5, రింక్ పాయింట్ టూ పాయింట్(5వేల మీటర్లు) విభాగాలలో బంగారు పతకాలు సాధించింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కోచ్ రాజేష్, క్రీడా ప్రముఖులు ఆమెను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.



ఖ్యాతిని అభినందిస్తున్న కోచ్

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్‌రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా పంచాయతీలు పనిచేయాలని డీఎల్‌డీవో జాలిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామాల సుస్థిరాభివృద్ధి, లక్ష్యాలపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలకు అర్హులను గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు పంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2030 నాటికి లక్ష్యాల సాధన దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, ప్రసాద్, వసంతకుమార్, వెంకటరావు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాళంగి పరిసరాల ప్రజలు అప్రమత్తం ఉండాలి



వట్రపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాళంగి రిజర్వాయర్ పైనున్న రాయలచెరువు కట్ట తెగడంతో సూళ్లూరుపేటలో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం తహసీల్దార్ పి.గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడు కాళంగి నదిని ఆనుకుని ఉన్న వట్రపాలెం, మన్నారుపోలూరు, పడమటికండ్రిగ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఏ సమయంలోనైనా కాళంగిలో నీటి ఉధృత పెరిగే అవకాశం ఉందని. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలన్నారు. సమీపంలో ఉన్న పొలాల్లో రైతులు, పశువుల కాపర్లు పనులకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

షార్‌లో విశ్రాంత ఇస్రో ఉద్యోగుల సమావేశం



ఇస్రో విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం ఇస్రో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. పరిపాలన భవనంలో జరిగిన ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ పాల్గొన్నారు. పెన్షన్, మెడికల్ సర్వీసు, 8వ పే కమిషన్, సీనియర్ సిటిజన్స్ రాయితీలు తదితర అంశాలపై చర్చించారు. షార్ డైరెక్టర్‌ను రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధుల జాన్సన్ ఫెర్నేండేజ్, పరందామన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను జగన్ ప్రోత్సహిస్తున్నారు

శాప్ చైర్మన్ రవి నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత జగన్ రెడ్డి డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు విమర్శించారు. విశాఖలో వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ దొరికిపోయినా పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అమ్ముతూ దొరికిపోతే ఎలా తప్పించుకోవాలో శిక్షణ ఇచ్చేందుకే తాడేపల్లిలో వైసీపీ యువజన విభాగం నేతలతో జగన్ సమావేశమయ్యారని ఎద్దేవా చేశారు. వైసీపీ అంటేనే డ్రగ్స్, గంజాయి పార్టీ అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏపీని డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నేత హేమంత్ రాయల్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో గురువారం రాయలచెరువు కట్ట తెగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఒక ప్రకటనలో కోరారు. రాయలచెరువు కట్ట తెగిపోవడంతో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు కొట్టుకుపోయాయని తెలిపారు. పలువురు రైతులకు చెందిన గుడిసెలు పడిపోయాయని వివరించారు. ప్రభుత్వం వెంటనే నష్టాన్ని అంచనా వేసి, త్వరితగతిన పరిహారం ఇవ్వాలని, పంట కాలువల ఆక్రమణలను తొలగించాలని కోరారు.

కోఆపరేటివ్ బ్యాంకులో ఇండ్ల వేలం

తిరుపతి(జీవకోన), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆరు తనఖా ఇళ్లకు బుధ, గురువారాల్లో అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ అడివిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జనరల్ మేనేజరు రవికుమార్‌రెడ్డి, చీఫ్ మేనేజరు వెంకటేశన్, మేనేజర్లు వినోద్‌బాబు, చంద్రబాబు పాల్గొన్నారు.